RNI : TGTEL/25/A4524

# ఇదే నిజం వార్తలు

ప్రతి అక్షరం.. రేపటి కోసం..

|హైదరాబాద్| |సంపుటి: 1| |సంచిక: 46| |06-02-2026| |శుక్రవారం| |పేజీలు: 11| |వెల : రూ.2/-

## భాయ్.. చాయ్ బనానే కో చాన్స్ దో



వివరాలు 8వ పేజీలో..


## రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి 'ఇదే నిజం' ఆహ్వానం పలుకుతున్నది



'ఇదే నిజం' తెలుగు దిన పత్రికలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పని చేయుటకు రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం

9492652230


# బీజేపీకి ఒక్కసీటు రాకుండా చేస్తాం

ప్రజాపాలన అందిస్తుంటే విషం చిమ్ముతున్నారు

### ఓ కుటుంబం మొత్తం ప్రభుత్వం పడిపోవాలని చూస్తోంది



- అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశాం
- ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియమ్మది
- పదేళ్లలో బీఆర్ఎస్ పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు
- బీజేపీ అధ్యక్షుడు పాలమూరుకు వచ్చి హామీలపై మాట్లాడలేదు
- బీజేపీకి ఈ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా రాకుండా చేస్తాం
- కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్
- పార్టీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో కలసి పనిచేయాలని హితవు

**కరీంనగర్, ఫిబ్రవరి 5:** ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారని సీఎం రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోందని పరోక్షంగా కెసిఆర్ కుటుంబంపై ఆరోపణలు చేశారు. తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.

మిగతా 2 లో



# వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు

- ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది
- 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నాం
- ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు.. ఓట్ బ్యాంక్ రాజకీయాలు
- రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోడీ
- విపక్షాల నిరసనుల.. నినాదాలు.. చివరకు వాకౌట్

4

రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్

వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి.

## గ్రూప్-1 ఉద్యోగులకు ఊరట



సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం

2

## మేడారంలో గ్యాంగ్ రేప్ జరగలేదు



మహిళా కమిషన్ ఎంక్వయిరీ కమిటీ

3



2

## ఉమెన్స్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

సకాలంలో మంటలర్పిన అగ్నిమాపక సిబ్బంది

ఉదయం అంతా బయటకు వెళ్లడంతో తప్పిన ప్రాణాపాయం

## పన్నెండేళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు

- పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్‌తో ఒరిగింది శూన్యం
- మజ్లిస్ కనుసన్నల్లోనే రెండు ప్రభుత్వాల పాలన
- మద్యం ఆదాయం.. భూముల అమ్మకం ఇదే పాలసీనా
- రేవంత్ సర్కార్‌పై ఘాటు విమర్శలు చేసిన కిషన్ రెడ్డి



3

## తులం బంగారం వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయండి

- పదేళ్ల బీఆర్ఎస్ అభివృద్ధి.. రెండేళ్ల కాంగ్రెస్ ధోఖా పనులు
- సిరిసిల్ల ప్రచారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్

ఓవైపు అభివృద్ధి చేసిన బీఆర్ఎస్, మరోవైపు ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్, ఎప్పుడో ఒకసారి దేవుని పేరు చెప్పుకుని వచ్చే బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఎవరికి ఓటు వేయ్యాలో మీరే నిర్ణయించుకోవాలి.. అని కేటీఆర్ అన్నారు.

3





## మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన మంత్రి

వివరాలు 2లో



## అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

- యాప్‌ను ప్రారంభించిన అమిత్ షా

ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు.

4

# మేఘాలయలో ఘోరం

### బొగ్గు గనిలో పేలుడు ■ 16మంది కూలీల మృతి



మేఘాలయలో ఘోర ప్రమాదం జరిగింది. బొగ్గు గనిలో భారీ పేలుడు జరిగి 16 మంది ప్రాణాలు కోల్పోయారు. బొగ్గు గనిలో మరింత మంది చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. రెస్క్యూ టీం సహాయక చర్యలు కొనసాగిస్తోంది. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని గనిలో బొగ్గు తవ్వకాలు సమయంలో పేలుడు జరిగింది. గురువారం ఉదయం సమయంలో థాంగ్స్కు ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఈ బొగ్గు గనిని అక్రమ బొగ్గు గనిగా అధికారులు గుర్తించారు.

వివరాలు 4వ పేజీలో



# గ్రూప్-1 ఉద్యోగులకు ఊరట

## సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం

**హైదరాబాద్,ఫిబ్రవరి 5 :** గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు ఊరట కల్పించింది. గ్రూప్ 1 నియామకాల వ్యవహారంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో.. గ్రూప్ 1 నియామకాలపై విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్ ధర్మాసనం.. జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను పునః మూల్యాంకనం చేయాలని నాడు న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులు హైకోర్టులో పిల్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి.. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తుది తీర్పునకు లోబడి గ్రూప్ 1 నియామకాలు చేపట్టవచ్చని ఇప్పటికే గతంలో ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల ఆధారంగా ప్రభుత్వం ఇప్పటికే 562మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసింది.

### అభ్యర్థులకు సిఎం అభినందన

గ్రూప్ -1 నియామకాల అంశంలో హైకోర్టు తీర్పుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామన్నారు. ఎందరు, ఎన్ని కుట్రలు పన్ని.. ఉద్యోగ నియామకాలను అడ్డుకోవాలని చూసినా.. వారి కుట్రలు, కుతంత్రాలను ఛేదించి న్యాయ పోరాటంలో విజయం సాధించామని తెలిపారు. న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో 563 మంది గ్రూప్-1 అభ్యర్థులకు అభినందనలు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి గ్రూప్ -1 అధికారులుగా మీరు నియమితులయ్యారు. ఇక రాష్ట్ర పునర్ నిర్మాణానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

# ఉమెన్స్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

## సకాలంలో మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది

## ఉదయం అంతా బయటకు వెళ్లడంతో తప్పిన ప్రాణాపాయం



**హైదరాబాద్, ఫిబ్రవరి 5:** ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో గల ఓ ఉమెన్స్ హాస్టల్లో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై స్థానికులు అగ్నిమాపక అధికారులు, పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అదృష్టవశాత్తూ ప్రమాద సమయంలో ఆ వసతి గృహంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌లోని సుధామ పీజీ అకామడేషన్ ఫర్ ఉమెన్స్ హాస్టల్లో అగ్నిప్రమాదం జరిగింది. హాస్టల్‌లో ఉన్న యువతులంతా.. విధులు, కాలేజీలకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఒకవేళ రాత్రి సమయంలో లేదా విద్యార్థులున్న సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించి ఉండవచ్చని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న మూడు ఫైర్ ఇంజిన్లు.. మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి. అగ్నిమాపక సిబ్బందితో పాటు హైడ్రా బృందాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొని మంటలు పక్క భవనాలకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. నగరంలోని పీజీ హాస్టళ్లలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండటానికి పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచనలు చేశారు. పాత పీజీ హాస్టళ్లలో ఎలక్ట్రికల్ వైరింగ్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయించాలని అన్నారు. ప్రతి అంతస్తుల్లో ÷ర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు ఎలా స్పందించాలో హాస్టల్ విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందనే దానిపై అధికారులు అంచనా వేస్తున్నారు.

# మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

## లెక్కింపునకు పది రోజుల సమయం పట్టే అవకాశం



**హనుమకొండ, ఫిబ్రవరి 5:** ఆసియా అతిపెద్ద గిరిజన జాతర మేడారం హుండీల లెక్కింపు ప్రారంభమైంది. హుండీల లెక్కింపునకు పది రోజుల సమయం పడుతుందని భావిస్తున్నారు. రెండేళ్లకోసారి వచ్చే ఈ మహా జాతర గత నెల 28 నుంచి 31 వరకు జరిగింది. సమ్మక్క, సారలమ్మలను కోట్లాది మంది భక్తులు దర్శించుకుంటారు. జాతరకు నెల రోజుల ముందు, జాతర అనంతరం మరికొన్నిరోజులు మేడారంను భక్తులు సందర్శిస్తారు. ఈ మహా జాతర హుండీలను హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. గురువారం మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి లెక్కింపును ప్రారంభించారు. మేడారం జాతరకు తరలి వచ్చిన భక్తులు అమ్మవార్లకు కానుకలు సమర్పించుకున్నారు. క్రితంసారి మేడారం జాతరకు రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది.

# బీజేపీకి ఒక్కసీటు రాకుండా చేస్తాం

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు. ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పకుండా తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా భాజపా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. దేశంలోని భాజపా నేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో భాజపాకు చూపిస్తాం అని రేవంత్ అన్నారు. భాజపా, బీఆర్ఎస్ బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం.. మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే.. ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.



'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. గురువారం నాడు కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు రేవంత్ రెడ్డి. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థలకు దిశానిర్దేశర చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు వాటి వల్ల చేకూరిన లబ్దిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు. మనం అబద్దాలు చెప్పాల్సిన పనిలేదని.. ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్, వరంగల్‌ను జంట నగరాలుగా తీర్చిదిద్దుతాం

## కరీంనగర్‌కు రింగ్ రోడ్డు నిర్మిస్తాం

## గోదావరి పుష్కరాల్లో బాసర నుంచి భద్రాద్రి వరకు అభివృద్ధి

## రామడుగులో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్

## కరీంనగర్ పర్యటనలో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపన



**కరీంనగర్,ఫిబ్రవరి 5:** కరీంనగర్ జిల్లా చొప్పదండిలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసారు. 2027 లో గోదావరి పుష్కరాలు రాబోతున్నాయి. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ఆలయాలను అభివృద్ధి చేస్తాం అని సిఎం అన్నారు. ఎకో టూరిజంను అభివృద్ధి చేసి పర్యాటక క్షేత్రంగా తీర్చి దిద్దుతాం అన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ దర్శనానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రాలేదని అంటూ.. పేదోళ్ల దేవుళ్లను మొక్కేందుకు వాళ్లకు నామోషీ.. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం అన్నారు. కరీంనగర్‌కు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తాం. వరంగల్, కరీంనగర్ జంట నగరాలుగా అభివృద్ధి చేసి రెండింటి మధ్యలో డంప్ యార్డు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తాం అని అన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.45.15 కోట్లతో కరీంనగర్ జిల్లా రామడుగులోఅడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రు. 5 కోట్లతో కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చొప్పదండి మండలం గుమ్లాపూర్ లో ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన- ప్రగతి బాట' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తామని కరీంనగర్ గడ్డపై నుంచి సోనియా గాంధీ మాట ఇచ్చారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సర్వం కోల్పోయినా.. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఏర్పాటు చేశారని అన్నారు. పదేళ్లు అంది వచ్చిన అధికారాన్ని అవకాశాన్ని ఉపయోగించుకుని బీఆరెస్ నాయకులు వేల కోట్లు సంపాదించుకున్నారు తప్ప ప్రజలకు చేసిందేం లేదు. పదేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటే ఇప్పుడు వాళ్లు విషం చిమ్ముతున్నారు. పదేళ్లలో కనీసం పేదలకు డబుల్ బెడ్రూంలు కూడా ఇవ్వలేదు. ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చుకుంటున్నాం. రైతులకు ఉచిత కరెంట్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్.. అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల వరకు పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నాం. సన్నబియ్యం, ఆర్టీసీలో మహిళలకు ఉచితసౌకర్యం అందించాం అన్నారు. పదేళ్లలో బీఆరెస్ ఏం చేసింది, పన్నెండేళ్లల్లోమోదీ ఏం చేశారో చర్చిద్దాం రండి? రెండేళ్లలో మేం ఏం చేశామో చెబితే మీ గుండెలు పగులుతాయ్ అని సిఎం అన్నారు. నిరుద్యోగులకు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం అన్నారు. వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం. హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచాం. చొప్పదండిలో డిగ్రీ కాలేజీ నిర్మిస్తున్నాం. రైతులకు 25 లక్షల 35 వేల మంది రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేశాం 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా అందించాం. కేవలం రైతుల కోసమే రెండేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి అనిమీరంటే.. రైతులు పండించిన ప్రతీ గింజ మా ప్రభుత్వం కొంటుంది. వ్యవసాయం పండుగ చేసి చూపిస్తున్నాం.. ఆడబిడ్డలు కట్టుకునే చీరల్లో కూడా గత ప్రభుత్వంలో కమిషన్లు తీసుకున్నారని మండిపడ్డారు. మా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం రెండేళ్లల్లో రూ. 9 వేల కోట్లు ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.27 కోట్లు మహిళలకు రుణాలు అందించి వ్యాపారంలో ప్రోత్సహిస్తున్నాం ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం. రాష్ట్రాన్ని దోచుకుని అప్పులపాలు చేసి పోయి కెసీఆర్ ఫామ్ హౌస్ లో పడుకున్నాడని ఎద్దేవా చేశారు.



# ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత హతం !

**రాయపూర్,ఫిబ్రవరి 5 :** ఛత్తీస్‌ఘడ్ బీజాపూర్ జిల్లా తర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్లటూన్-30 కమాండర్ ఉదమ్ సింగ్ మృతి చెందినట్లు ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. బీజాపూర్ జిల్లాలో గురువారం ఉదయం నుంచి భద్రత బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. డీఆర్‌జీ (డిస్టిక్ రిజర్వ్ గార్డు) సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. పెద్దగెల్లూరు అడవిలో మావోయిస్టులు ఉన్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో బలగాలు ఆ ప్రాంతంలో ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఇరు వర్గాలకు మధ్య కాల్పులు జరిగాయి. అయితే ఘటనాస్థలి నుంచి ఆటోమేటిక్ ఏకే-47 రైఫిల్‌తో పాటు పలు ఆయుధసామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.



# తులం బంగారం వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయండి

- పదేళ్ల బీఆర్ఎస్ అభివృద్ధి.. రెండేళ్ల కాంగ్రెస్ ధోఖా పనులు
- సిరిసిల్ల ప్రచారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్



**రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి5:** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో ఫుల్ బిజీగా ఉన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బివైనగర్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారని ఆయన విమర్శించారు. 'ఓవైపు అభివృద్ధి చేసిన బీఆర్ఎస్, మరోవైపు ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్, ఎప్పుడో ఒకసారి దేవుని పేరు చెప్పుకుని వచ్చే బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఎవరికి ఓటు వేయ్యాలో మీరే నిర్ణయించుకోవాలి' అని కేటీఆర్ అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పోటీ గత పదేళ్లలో ప్రజల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన బీఆర్ఎస్ పార్టీకి, గడిచిన రెండేళ్లలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్నదని కేటీఆర్ చెప్పారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే తగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికలతోనే కేసీఆర్‌నుముఖ్యమంత్రిని చేసుకునే కార్యక్రమం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ వాళ్లు తులం బంగారం ఇస్తానన్నారు. కానీ, వాళ్లు ఉన్న పుస్తెలు ఎత్తుకు పోయే రకం. నాపై కోపంతో బతుకమ్మ చీరలు బంద్ చేశారు. నేతన్నల బతుకుదెరువుపై దెబ్బ కొట్టారు. దేవుని గుడి వద్ద ఉండి అడుక్కుతినేవారిలాగా, దేవుని పేరుతో ఓట్టడుక్కోవడానికి మాత్రమే బీజేపీ వారే వస్తారు. అలానే కాంగ్రెస్ కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారు. తులం బంగారం వచ్చిన వారు కాంగ్రెస్‌కు ఓటెయ్యండి, రాని వారు బీఆర్ఎస్‌కు ఓటెయ్యండి. సిరిసిల్ల బతుకుదెరు వు లేకుండా చేసినోడికి, బుద్ధి చెప్పాలి' అని కేటీఆర్ తెలిపారు. ఇప్పటికే అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మున్సిపల్ ఎన్నికల కోసం మరోసారి అబద్ధాలు చెబతోందని విమర్శించారు. 'ముఖ్యమంత్రికి చేతిలో అధికారం, అవకాశం ఉన్నప్పుడు మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టవలసిన అవసరం ఏమున్నది? చేతనైతే ప్రజలకు మంచి చేయాలి, ఇచ్చిన హామీలు అమలు చేయాలి. కానీ కేసీఆర్‌ను తిట్టవలసిన అవసరం ఏముంది..? ప్రతి అంశంలో అడ్డగోలుగా మాట్లాడటం, అబద్ధాలు ఆడటం తప్పించి, ఈ రెండేళ్ళలో ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదు. కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను తీసివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది. ఈ ఎన్నికల్లో జిల్లా కేంద్రాలను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ మాటలు చూసి ఓటు వేయాలి. జిల్లాలు ఎత్తివేస్తామని చెప్పిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటువేస్తే అది మంచా, చెడా అన్న విషయాన్ని గుర్తించి ఓటు వేయాలని కేటీఆర్ సూచించారు.

# పన్నెండేళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు

- పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్‌తో ఒరిగింది శూన్యం
- మజ్లిస్ కనుసన్నల్లోనే ప్రభుత్వాల పాలన
- రేవంత్ సర్కార్‌పై కిషన్ రెడ్డి విమర్శలు




**హైదరాబాద్, ఫిబ్రవరి 5:** తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. పన్నెండు ఏళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు నడుపుతున్నారని విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్ పదేళ్లు బానిస పాలన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ సైతం మజ్లిస్ ఓట్ల కోసం బానిస పాలన చేస్తుందంటూ మండిపడ్డారు. గురువారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ భూములను విక్రయించడం అభివృద్ధా? అంటూ ఈ రెండు పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు. మద్యం, డ్రగ్స్‌తో కుటుంబాలు పతనం అవుతున్నా.. ఈ ప్రభుత్వానికి కావాల్సింది మాత్రం ఆర్థిక వనరులేనని కేంద్ర మంత్రి అన్నారు. భూములు అమ్మాలి.. అప్పులు చేయాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. అవినీతి, దోపిడి ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. వీధి దీపాలు వెలిగించేందుకు డబ్బులు లేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యంగ్యంగా అన్నారు. పని చేసే పార్టీలకే ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఐదు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఇదా ప్రజా ప్రభుత్వమా.. పని చేసే ప్రభుత్వమా? సమాధానం చెప్పాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పని చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో ఎందుకు లేవని ఆయన రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత పదేళ్లు ఏమీ చేశారంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం.. కాంగ్రెస్ పార్టీకి బంగారు బాతు అయిందన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఇక్కడి నుంచే నగదు పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ మాత్రం ఇవ్వరన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఆర్ఆర్ ట్యాక్స్‌తో వ్యాపారస్తులు భయపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలకు ఎంత నగదు ఇచ్చారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని బల్లగుద్దీ మరి ప్రశ్నించారు. ఫిక్సడ్ రేట్స్.. వన్ టైమ్ పేమెంట్‌ను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కగా కొనసాగిస్తుందని విమర్శించారు. గత 26 నెలల్లో ఏమీ చేసిందో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇంటి అల్లుడి ఫోన్ ట్యాపింగ్ చేసిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ పీకారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బాషలో అడుగుతున్నా నన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు.

# కేసీఆర్‌పై విషం కక్కుతున్న సీఎం రేవంత్

**బూతుల ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలుస్తారు**

**మాజీమంత్రి హరీష్ రావు ఘాటు విమర్శ**



**హైదరాబాద్,ఫిబ్రవరి 5 :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వికృత మాటలకు సభ్య సమాజం ఛీ కొడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జాతిపిత అన్నందుకు రేవంత్ రెడ్డి విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే ఆవేదన కలుగుతోందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వరుస విమర్శలపై మాజీ మంత్రి హరీశ్ రావు గురువారం కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్‌ను జాతిపితగా తెలంగాణ సమాజం పిలుచుకుంటే రేవంత్ రెడ్డికి ఎందుకు కడుపునొప్పి అని ప్రశ్నించారు. బూతుల ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో మిగిలిపోతాడన్నారు. పాలన చేతకాక సీఎం రేవంత్ రెడ్డి నిరాశ నిస్పృహలో ఉన్నారని చెప్పారు. నీతి లేకుండా జాతి అని మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ వైఖరిని ఎండగట్టారు.సీఎం రేవంత్ రెడ్డి భాష, అరాచకాలపై స్పందించాలంటూ తెలంగాణ మేధావులకు ఈ సందర్భంగా హరీశ్ రావు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి అదుపు తప్పి ఎలా మాట్లాడుతున్నారో గమనించాలంటూ కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు సూచించారు. ఇలాంటి ముఖ్యమంత్రి తెలంగాణకు ఉండటం మన దౌర్భాగ్యమన్నారు. ఏడేళ్లలో ఎస్ఎల్‌బిసి టన్నెల్‌ను 11 కిలో కిలోమీటర్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో తవ్వామని.. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం వంద మీటర్లు కూడా తవ్వలేదని విమర్శించారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో శవాలు బయటకు తీసుకురాలేని దద్దమ్మ రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడితే అమరవీరుల ఆత్మ ఘోషిస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ఇచ్చారని.. అదే వేదికపై రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారని తెలిపారు. ప్రతిసారీ డైవర్షన్ చేయాలనుకుంటే ప్రజలే రేవంత్‌ని ముఖ్యమంత్రి పదవి నుంచి డైవర్షన్ చేస్తారని చెప్పారు. ప్రతి నెలకో కుంభకోణానికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ నేతలపై తీవ్ర ఆరోపణలు చేశారు హరీష్ రావు. గ్యారెంటీలు నిల్.. స్కామ్‌లు ఫుల్ అంటూ రేవంత్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తన కుర్చీని కాపాడుకోవటానికి బీజేపీతో రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ ఎంపీ సీటును బీజేపీకి రేవంత్ రెడ్డి బహుమానంగా ఇచ్చారని చెప్పారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరవలేదన్నారు. పగ ప్రతీకారాలు తప్ప పాలన మీద దృష్టి లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిపై మండిపడ్డారు. రూ. 25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఎక్కడ ఇచ్చావో ప్రెస్ క్లబ్‌లో చర్చ పెడదామా? అంటూ సీఎం రేవంత్‌కు హరీశ్ రావు సవాల్ విసిరారు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి వచ్చిన తర్వాత అయినా మారాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా హరీశ్ రావు హితవు పలికారు. రేవంత్ రెడ్డి మారతారన్న నమ్మకం తనకు లేదని హరీశ్ రావు స్పష్టం చేశారు.



# మేడారంలో గ్యాంగ్ రేప్ జరగలేదు

**మహిళా కమిషన్ ఎంక్వయిరీ కమిటీ**

**ములుగు, ఫిబ్రవరి 5:** మేడారం జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరగలేదని జాతీయ మహిళా కమిషన్ ఎంక్వయిరీ కమిటీ తేల్చి చెప్పింది. గురువారం మధ్యాహ్నం జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డెలినా, కంచన్ కట్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ములుగుకు చేరుకుంది. అనంతరం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ దివాకరం, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌తో కమిటీ సమావేశమైంది. ఆ తర్వాత గ్యాంగ్ రేప్‌పై విచారణ చేపట్టింది. అలాగే ఈ ఘటన జరిగిందంటూ ఆరోపిస్తున్న ప్రదేశాన్ని సైతం కమిటీ సభ్యులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ జాతరలో ఎలాంటి గ్యాంగ్ రేప్ ఘటన జరగలేదని సదరు కమిటీ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. దాంతో పోలీసుల నుంచి లిఖిత పూర్వక నివేదిక వచ్చాక.. జాతీయ మహిళా కమిషన్‌కు ఈ ఎంక్వయిరీ కమిటీ.. రిపోర్టును అందించనుంది. మేడారంలో జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు సమ్మక్క-సారలమ్మ జాతర జరిగింది. ఈ జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందంటూ సోషల్ మీడియాలో వార్త వైరల్ అయింది. మామిడితోటలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పలువురు యువకులు వాష్ రూమ్‌కు వెళ్లిన బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ప్రచారం జరిగింది. అనంతరం ఈ ఘటనకు కారణమైన యువకులు జంపన్నవాగు సమీపంలోని ఒక షాపులో దాక్కున్నారని.. వారిని పోలీసులు తీసుకువెళ్లినట్లు ఆ వార్త కథనంలో పేర్కొన్నారు. ఈ వార్తను ఇప్పటికే ములుగు ఎస్పీ రామ్‌నాథ్ సుధీర్ కేకర్ ఖండించారు. అలాంటి ఘటన ఏదీ చోటు చేసుకోలేదని స్పష్టం చేశారు. మరోవైపు ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ సీరియస్ అయింది. కమిషన్‌లోని సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ.. ములుగు వచ్చి వాస్తవ పరిస్థితులు పరిశీలించి.. కమిషన్‌కు నివేదిక అందజేయనుంది.

# బీజేపీని గెలిపిస్తే దండిగా నిధులు

**ప్రచారంలో హామీలు గుప్పించిన బండి**




**కరీంనగర్, ఫిబ్రవరి5:** మున్సిపాలిటీల్లో బీజేపీని గెలిపిస్తే నిధుల వరద పారిస్తానని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మున్సిపాలిటీలకు వచ్చేది కేంద్ర నిధులేనని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని, మున్సిపల్ ఎన్నికల్లో భాజపాని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. హుజూరాబాద్ సూపర్ బజార్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం రూ.వందల కోట్లు తీసుకొచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని పరికరాలు తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం సరైన సిబ్బందిని నియమించట్లేదు. గత పదేళ్ల నుంచి హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చిందా? ఈ ప్రభుత్వం హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఒక్కపైసా ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే ఇక్కడ మినీ స్టేడియం నిర్మిస్తాం. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్ని ట్యాక్సులు పెంచుతారు. మేం దిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్‌ను అభివృద్ధి చేయిస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.


# పవన్‌తో పొత్తుతో విషం చిమ్ముతున్న బీజేపీ

**తెలంగాణ వ్యతిరేకి పవన్ కల్యాణ్**

**కాంగ్రెస్‌కు ఓటేస్తేనే అభివృద్ధి సాధ్యం: పొన్నం**



**హుస్నాబాద్, ఫిబ్రవరి 5:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పొత్తుపెట్టుకుని బీజేపీ తెలంగాణపై విషం చిమ్మడాన్ని ప్రజలెవ్వరూ సహించరని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణను వ్యతిరేకించే విధానాలకు బీజేపీ పాల్పడుతుందని విమర్శించారు. ఒక వైపు తెలంగాణకు నిధులు ఇవ్వకుండా మోసం చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. మరోవైపు తెలంగాణ కండ్లు పడి ఆంధ్రా కొబ్బరి చెట్లు ఎండిపోయాయన్న పవన్ కళ్యాణ్ తెలంగాణలో ప్రచారం చేస్తామంటే ఎవరూ చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలను అవమానపరిచే విధంగా, వివక్షపూరితంగా మాట్లాడే వ్యక్తులతో పొత్తులు పెట్టుకుని వస్తున్న బీజేపీ ఆలోచనను తెలంగాణ మేధావులు,ప్రజలు ఆలోచించాలని కోరారు. హుస్నాబాద్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. అలాగే గత పదేళ్లలో బిఆర్ఎస్ చేసింది సున్నా అని అన్నారు.



సంపాదకీయం

# మోహన్‌బాబు వర్సిటీలో సినిమా తరహా శిక్షలా?

నటుడు మోహన్ బాబు విద్యాసేవ ఎలాంటిదో బట్టబయలు అయ్యింది. పైకి నీతి సూత్రాలు వల్లిస్తూ.. జలగల్లా పీక్కుతుంటున్న తీరు వెలుగుచూసింది. తను పేదలకు ఉచితగా విద్యను అందిస్తున్నానని చెబుతున్న బాంబికపు మాటలు ఉత్తవే అని తేలింది. ఇదంతా ఒక ఎత్తయితే ఇటీవల ఓ విద్యార్థి ఆత్మహత్య మరింత కలకలం రేపుతోంది. ఇక్కడి అవినీతిపై ప్రశ్నించిన విద్యార్థులను కిడ్నాప్ చేయించడం చూస్తే మోహన్‌బాబు ఆయన తనయుడు ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు. నిజానికి కార్పోరేట్ కళాశాలల అవినీతి కథలు అనకొండలా బుసలు కొడుతున్నాయి. అనుమానాస్పద మరణాలు, ఆత్మహత్యలపై ప్రభుత్వాలు కిమ్మనడం లేదు. నయా ఆర్థిక విధానాల పుణ్యమా అని కార్పొరేట్ల చేతుల్లో చిక్కుకున్న విద్యావ్యవస్థకు ఇప్పటికే లాభార్జన ప్రధానంగా మారింది. అక్కడి నుండి తమ ఖజానాలు నింపుకోవడానికి, ఎంతటి దారుణమైనా చేసే మాఫియా ముఠాల స్థాయికి కార్పొరేట్ విద్యా వ్యవస్థ దిగజారుతున్న తీరుకు తాజా పరిణామం ఒక నిదర్శనం. ఇది ఒక్క మోహన్ బాబుకే పరిమితం కాదు. ఇప్పుడు మోహన్‌బాబు వ్యవహారం బయపడింది. గతంలో నారాయణ, శ్రీచైతన్య స్కూళ్లు, కాలేజీల్లో వందలమంది పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అనుమానాస్పద మృతి చెందారు. ఇవన్నీ బయటకు రాకపోవడానికి ఘనత వహించిన పాలకుల తీరే కారణం. ఇక మోహన్ బాబు విద్యాసంస్థల వ్యవహారానికి వస్తే..ఫీజుల దందాపై గళమిప్పిన ఎస్ఎఫ్ఐ నేతలను కిడ్నాప్ చేయడానికి తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం బరితెగించిన తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. బౌన్సర్లతో విద్యార్థి నేతలను బలవంతంగా ఎత్తుకుపోవడం, వారిపై అమానుషంగా దాడి చేయడం వంటి చర్యలు ఆ విశ్వవిద్యాలయంలో నేరాలు వ్యవస్థీకృతమైన తీరుకు, యాజమాన్య నేర ప్రవృత్తికి నిదర్శనాలు. సినిమాలో విలన్‌లా మోహన్ బాబు నిజజీవితంలో కూడా వ్యవహరించారన్న ఆరోపణలకు సమాధానం చెప్పుకోవాలి. విద్యాసంస్థల్లో సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేయడం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం సహజ పరిణామమే. మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో జరిగింది కూడా ఇదే! కానీ, విద్యాసంస్థ యాజమాన్యం అన్ని పరిధిలను అతిక్రమించి ప్రశ్నించిన వారిని ఎత్తుకెళ్లి, భౌతికదాడులు చేసి, అంతం చేసేలా వ్యవహరించడం ఖచ్చితంగా బరితెగింపునకు నిదర్శనం. సొంత జిల్లాలో ఇంతటి దారుణం జరిగినా సిఎం చంద్రబాబు ఇప్పటి వరకు నోరు మెదపలేదు. దీనిగురించి ఆరా తీయలేదు. మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఫీజుల దందాపై దుమారం రేగడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ అధిక ఫీజుల వసూలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆరోపణలు వచ్చాయి. రకరకాల పేర్లతో సాగిన ఫీజుల దందా శృతి మించడంతో నియంత్రణ సంస్థల జోక్యం, కోర్టుల దాకా ఈ వివాదాలు వెళ్ళాయి. దాదాపు 26 కోట్ల రూపాయలను యాజమాన్యం అక్రమంగా వసూళ్లు చేసినట్లు ఉన్నత విద్యామండలి నిర్ధారించింది. అక్రమ వసూళ్లకు పాల్పడటంతో 15 కోట్ల రూపాయల జరిమానాను ఉన్నత విద్యామండలి విధించింది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ కష్టార్జితాన్ని వెనక్కి తీసుకోవడానికి పోరాటం కొనసాగించారు. మరోసారి ఉన్నత విద్యామండలిని ఆశ్రయించారు. ఇది యాజమాన్యానికి నచ్చలేదు. యూనివర్శిటీ ప్రాంగణానికి వారిని పిలిపించి మోహన్‌బాబు కుమారుడు మంచు విష్ణు బౌన్సర్లతో దాడి చేయించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేసే విద్యార్థి సంఘాలు సహజంగానే ఈ దౌర్జన్యంపై దృష్టి సారించింది. విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఆందోళన చేపట్టింది, ఇది నచ్చని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం విద్యార్థులను బెదిరించడానికి మాఫియా అవతారమెత్తి కిడ్నాప్‌లకు, దాడులకు దిగడం అమానుషం. వివాదం ప్రారంభమైన వెంటనే యాజమాన్యం సంయమనం పాటించి, విద్యార్థులతోనూ, వారి తల్లిదండ్రుల తోనూ చర్చించి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదు. బయటకు నీతి వాక్యాలు చెప్పే మోహన్ బాబు తన యూనివర్సిటీలో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సింది. కానీ ఆయనకూడా మైనంగా ఉండడం చూస్తుంటే ఇదంతా తెలిసీ చేస్తున్నారనే ప్రచారం సాగింది. విద్యార్థుల నిరసనను అణచివేయాలన్న దృష్టిలో దాష్టీకాలకు తెగించడం సరికాదు. విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య హక్కు. నా యూనివర్ఇసటీ ఇది అని చెప్పడానిక కుదరదు. తాజా వ్యవహారంలో వెంటనే పోలీసులు స్పందించిన తీరు ప్రశంసనీయం. తక్షణమే వారు స్పందించకుంటే బౌన్సర్ల నిర్బంధంలో ఉన్న విద్యార్థి నేతల పరిస్థితి మరింత ఘోరంగా మారి ఉండేది. ఈ వ్యవహారంలో ఇప్పటికే విశ్వవిద్యాలయ పిఆర్ఓ సతీష్, మోహన్‌బాబు, మంచు విష్ణులపై కేసులు నమోదయ్యాయి. విచారణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, కిడ్నాపర్లు, వారి వెనుక వున్న వారిని కఠినంగా శిక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న మోహన్‌బాబు యూనివర్శిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలి. వారి తల్లిదండ్రుల నుండి అక్రమంగా వసూలు చేసిన కోట్లాది రూపాయల మొత్తాన్ని వెనక్కి ఇప్పించాలి. విద్యా సంస్థలు మాఫియా ముఠాలుగా మారకుండా, సామాజిక బాధ్యతతో పని చేసేలా, ఫీజులు, సదుపాయాలు, భద్రత వంటి అంశాల్లో అత్యంత పారదర్శకంగా వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! అందుకు చంద్రబాబు ప్రభుత్వం తక్షణం పూనుకోవాలి. విద్యార్థులకు అండగా ఉన్నామని నిరూపించాలి.



# వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు


- రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్
- ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది
- 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నాం
- ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు
- దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదు
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్..
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు.. ఓట్ బ్యాంక్ రాజకీయాలు
- రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోదీ
- విపక్షాల నిరసనలు.. నినాదాలు.. చివరకు వాకౌట్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 5 :** వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్వాతంత్ర్యం తొలి నాళ్లల్లో భారత్ ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంక కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు. ఒకప్పుడు భారత్ బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. ప్రపంచ సవాళ్లకు భారత్ పరిష్కారాలు చూపించే స్థితిలో నిలిచి ఒక ఆశాకిరణంగా మారిందని అన్నారు. అధిక వృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం కలగలిసిన అరుదైన స్థితిలో భారత్ ఉందని అన్నారు. మునుపటి ప్రభుత్వాల తప్పులను సరిచేసేందుకే అధిక శాతం తమ శక్తియుక్తులను వినియోగించాల్సి వస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా మూటగట్టుకున్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించుకుంటున్నామని అన్నారు. ఈ నష్టాన్ని సరిచేసేలా భవిష్యత్తుకు తగిన విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్లోబల్ సౌత్‌గా పేరు పడ్డ దేశాల తరపున భారత్ అంతర్జాతీయ వేదికలపై బలంగా తన వాణిని వినిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు దార్శనికత లేదని విమర్శించారు. ఫలితంగా భారత్ చాలా కాలం పాటు కష్టాలు పడిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వ్యవస్థలు బలహీనపడతాయని అన్నారు. ప్రపంచంలో అగ్రగామి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం ఉత్సుకతతో ఉన్నాయని చెప్పారు. ఈయూ ట్రేడ్ డీల్‌తో ప్రపంచంలో స్థిరత్వంపై వివిధ దేశాలకు నమ్మకం పెరిగిందని అన్నారు. అమెరికాతో ఒప్పందంతో ఈ భావన మరింత బలపడిందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్‌పై ప్రధాని మోదీతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోం దన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నత పదవికే అవమానకరమన్నారు. దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు. తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి. బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ రంగ సంస్థలకు అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ.30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ది పొందారు. 2014 తర్వాత ఎ÷–లానింగ్ కమిషన్‌ను తీసేసి నీతిఆయోగ్‌ను తెచ్చాం. ఇది వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది. అక్రమార్కులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ వలసదారులను బయటకు పంపించివేస్తున్నాయి. బెంగాల్‌లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

యాప్‌ను ప్రారంభించిన అమిత్ షా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేవలు విజయవంతమైన నేపథ్యంలో ఎట్టకేలకు అందుబాటులోకి తెచ్చారు. తొలుత దిల్లీ–రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు లభిస్తాయి. రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. ఇందులో లాభాలు డ్రైవర్లకే వెళతాయని చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయి. డ్రైవర్ల నుంచి ఆయా సంస్థలు కొంతమొత్తం కమీషన్‌గా వసూలు చేస్తున్నాయి. వారి శ్రమను ఆయా కంపెనీలు దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద 2025 జూన్ 5న 'భారత్ ట్యాక్సీ'కి కేంద్రం రూపకల్పన చేసింది. జీరో కమీషన్, సర్జ్‌ప్రైసింగ్ లేని విధానం, డ్రైవర్లకు లాభాలు పంచిపెట్టడం దీని ముఖ్య ఉద్దేశం. దిల్లీ–ఎన్‌సీఆర్, గుజరాత్‌లో డిసెంబర్ 2 నుంచి ప్రయోగాత్మకంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల డ్రైవర్లు ఇందులో చేరగా.. లక్ష మంది యూజర్లు రిజిస్టర్ అయ్యారు. రోజుకు 10 వేల రైడ్లు జరిగాయి. సుమారు రూ.10 కోట్లను డ్రైవర్లకు లాభాలుగా అందించనట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రైవర్లకు 'సారథి' పేరిట ఆరోగ్య, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సేవింగ్స్ కూడా లభిస్తాయి.

# మేఘాలయ బొగ్గుగనిలో పేలుడు

**పేలుడు ఘటనలో 16 మంది దుర్మరణం**

**షిల్లాంగ్,ఫిబ్రవరి 5 :** మేఘాలయ రాష్ట్రంలో అక్రమ బొగ్గు తవ్వకాలు మరోసారి భారీ ప్రాణ నష్టానికి కారణమయ్యాయి. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని ఓ గనిలో బొగ్గు తవ్వుతుండగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి 16 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పేలుడికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. మేఘాలయలో ర్యాట్ హోల్ మైనింగ్, అశాస్త్రీయ పద్ధతుల్లో తవ్వకాలు జరుపుతున్నారు. అయితే, ఈ తవ్వకాలను 2014 నుంచి జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధించింది. ర్యాట్ హోల్ అంటే.. సమాంతరంగా సన్నని గుంత తవ్వుతూ బొగ్గును బయటకు వెలికి తీసే పద్ధతి. సుమారు 3, 4 అడుగుల వెడల్పుతో ఈ గుంతలు ఉంటాయి. అచ్చం ఎలుకలు బొరియలు తవ్వినట్టుగా ఉంటాయి కాబట్టి దీనికి 'ర్యాట్ హోల్ మైనింగ్' అనే పేరు వచ్చింది. ఇటీవల ఈ తవ్వకాలపై ఎన్జీటీ నిషేధాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.



# భారత్‌కు అమెరికా బంపరాఫర్

**ఢిల్లీ:** భారత్–అమెరికా ట్రేడ్ డీల్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా అమెరికాతో జరిగిన ట్రేడ్ డీల్‌లో రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను నిలిపివేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. ప్రతిఫలంగా అమెరికా.. భారత్‌కు విధించే ప్రతీకార పన్నును 18 శాతం తగ్గించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందంపై ఇరు దేశాల ప్రతినిధులు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేయనున్నారు. అదే సమయంలో అమెరికా నుంచి భారత్ సైతం 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం, సాంకేతిక ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు



తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రకటనపై వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సైతం స్పష్టత ఇచ్చారు. సీనియర్ అమెరికా అధికారులు వచ్చే వారం ఢిల్లీలో ఒప్పందంపై సంతకం చేయడానికి రానున్నట్లు చెప్పారు. కాగా, ఈ ఫిబ్రవరి 3న భారత్‌ఉఅమెరికా వాణిజ్య ఒప్పందం తుది రూపం దాల్చింది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా భారతీయ వస్తువులపై విధిస్తున్న సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గించింది. ఇది రెండు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించి, భారత ఎగుమతులకు కొత్త అవకాశాలు కలిగేందుకు దోహదం చేయనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ముంపు బాధితుల పక్షాన సీపీఎం పోరు

- సీపీఎం గెలిస్తే బాధితులు గెలిచినట్టే
- 12వ వార్డు అభ్యర్థిగా బండ్ల స్వామి
- మల్లన్నసాగర్ బాధితుల హక్కుల సాధనే లక్ష్యం
- ఆర్ అండ్ ఆర్ కాలనీల సమస్యలపై ఆగ్రహం



**గజ్వేల్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో 12వ వార్డు నుంచి సీపీఎం కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో ఉన్న బండ్ల స్వామి గురువారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్యతో కలిసి ఆయన వార్డులోని ఇంటింటికీ వెళ్లి సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వార్డు అభివృద్ధి సమస్యల పరిష్కారంతో పాటు మల్లన్నసాగర్ ముంపు బాధితుల హక్కుల సాధనే తమ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ప్యాకేజీలు ఈ సందర్భంగా బండ్ల స్వామి మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన 14 గ్రామాల ప్రజలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ కాలనీలకు తరలించి చేతులు దులుపుకుందని, వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుతం మున్సిపాలిటీ ఎన్నికల్లో ముంపు గ్రామాలను విలీనం చేసి ఆరు వార్డులుగా ప్రకటించారని, అందులో భాగమైన ఏటిగడ్డ, కృష్ణాపూర్, 12వ వార్డు పరిధిలోని బాధితుల గొంతుకగా నిలిచేందుకే తాను పోటీ చేస్తున్నానని తెలిపారు. భూములు కోల్పోయిన వారికి రావాల్సిన నష్టపరిహారాలు, ప్యాకేజీలు, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు, ఒంటరి మహిళలు, పురుషులకు దక్కాల్సిన హక్కులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చెక్కులు బ్యాంకుల్లో చెల్లని పరిస్థితి ఉందని గుర్తుచేశారు. మల్లన్నసాగర్ విషయంలో ఆరంభం నుంచి రైతులు, బాధితుల పక్షాన నిలిచింది సీపీఎం పార్టీయేనని బండ్ల స్వామి స్పష్టం చేశారు. గ్రామసభల్లో ఏకాభిప్రాయం లేకుండా భూసేకరణ చేయొద్దని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని తమ నాయకత్వం డిమాండ్ చేసిందన్నారు. తమ్మినేని వీరభద్రం పాదయాత్రతో బాధితుల్లో చైతన్యం నింపామని గుర్తుచేశారు. ప్రభుత్వాలు మారినా బాధితుల గోస తీరలేదని, నేటికీ ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో రోడ్లు, వీధిలైట్లు, రవాణా వంటి కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇది కేవలం ఒక వార్డు ఎన్నిక కాదని, ఆరు వార్డుల్లోని సుమారు 15 వేల మంది ఓటర్లు, 20 వేల పైచిలుకు జనాభా ఉన్న ముంపు గ్రామాల హక్కుల కోసం సాగుతున్న సమిష్టి పోరాటమని బండ్ల స్వామి అభివర్ణించారు. బీఆర్ఎస్ లేదా కాంగ్రెస్ గెలిస్తే ఆయా పార్టీలు గెలుస్తాయని, అదే సీపీఎం గెలిస్తే ముంపు బాధితులే గెలిచినట్లని పేర్కొన్నారు. పోరాటాల జెండా అయిన సీపీఎంను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రంగారెడ్డి, నాయకులు వినోద్ కుమార్, ఆంజనేయులు, ఆర్. శ్రీనివాస్, జీ రమేష్, ప్రవీణ్, సాత్విక్, ఘాసిరాం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల కోసం జైలుకెళ్లాం.. లాఠీ దెబ్బలు తిన్నాం



- నిర్వాసితుల పక్షాన నిలిచింది సీపీఐ పార్టీయే
- పెండింగ్ ప్యాకేజీల సాధన కోసమే మా పోరాటం
- బీజేపీకి ఓటేస్తే అభివృద్ధి శూన్యం
- గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో ముమ్మర ప్రచారం

**గజ్వేల్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా సీపీఐ పార్టీ ప్రచారాన్ని హోరెత్తించింది. పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ కార్యకర్తలతో కలిసి గురువారం 7, 9, 10, 13వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి 'కంకి కొడవలి' గుర్తుపై ఓటు వేసి, తమ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంద పవన్ మాట్లాడుతూ... మల్లన్న సాగర్ విషయంలో అనేక సమస్యలపైన పోరాడిన ఏకైక పార్టీ సీపీఐ అని గుర్తుచేశారు. 2013 చట్టం ప్రకారం భూనిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనేకమార్లు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించామన్నారు. నిర్వాసితుల కోసం జరిగిన పోరాటంలో పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నామని, జైలుకు కూడా వెళ్లామని తెలిపారు. బాధితుల సమస్యలు తీరాలంటే పోరాడే తత్వం ఉన్న సీపీఐ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ అభ్యర్థులను గెలిపిస్తే... ఇంకా పెండింగ్‌లో ఉన్న ఒంటరి మహిళల ప్యాకేజీలు, 18 ఏళ్లు నిండిన వారి ప్యాకేజీలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు, ఇళ్లు రాని వారికి ఇళ్లు, 'బై నంబర్' సమస్యలు... ఇలా అన్నింటిపైనా ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంతో పోరాడి సాధిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు బట్టు దానంత రెడ్డి మాట్లాడుతూ... భూనిర్వాసితులకు బీజేపీ చేసిందేమీ లేదని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తే అభివృద్ధి శూన్యమని, కాబట్టి ప్రజా సమస్యలపైన పోరాడే తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండలవనేశు, పట్టణ కార్యదర్శి స్వర్గం రాజేశం, శివలింగ కృష్ణ, పార్టీ నాయకులు మొట్ట శీను, కొండ కింది పోచయ్య, గూడూరు యాదమ్మ, పోతుల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో మద్యం నిషేధించాలి

కార్మికులను బానిసలుగా మారుస్తున్నారు

ఎన్నికల సంఘానికి అసోసియేషన్ వినతి

ప్రజా సంఘాలు ఉద్యమించాలని పిలుపు




**తూప్రాన్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మున్సిపల్ ఎన్నికల సమయంలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఓ మెమొరండం సమర్పించినట్లు ఆ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల పోచయ్య తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల సమయం వచ్చిందంటే చాలు.. రాజకీయ నాయకులు తమ ప్రచారం కోసం వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులను విరివిగా వాడుకుంటున్నారని పోచయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రచారానికి వచ్చే వారికి డబ్బుతో పాటు ప్రత్యామ్నాయంగా మద్యాన్ని ఎరగా వేస్తున్నారని, దీనివల్ల అమాయక కార్మికులు మద్యానికి బానిసలుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఎన్నికల సమయాల్లో లిక్కర్‌ను పూర్తిగా నిషేధించాలని కోరారు. మద్యం మహమ్మారి నుంచి పేదలను కాపాడుకునేందుకు ఈ సమస్యపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రజా సంఘాలు ఏకమై ఉద్యమంలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు దోస మౌనిక, ఉపాధ్యక్షులు విశ్వనాథ్ చందర్, ఇన్‌చార్జ్ వినోద్ కుమార్, సెక్రటరీ వెంకట్ నరసింహారెడ్డి, కోశాధికారి వెంకట్, కోఆర్డినేటర్ సాయి ప్రసాద్, న్యాయ సలహాదారు శ్రీనివాస్, సభ్యులు మేకల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రధాన పార్టీలకు 'కత్తెర' సవాల్

రెండో వార్డులో వినూతన ప్రచారం.. ప్రత్యేక ఆకర్షణగా మరగుజ్జు వాహనం


దూసుకుపోతున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థి సరిత

**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రచారం ఊపందుకుంది. పార్టీ తరఫున 'కత్తెర' గుర్తుపై పోటీ చేస్తున్న అభ్యర్థి ఈదునూరి సరిత తన వినూతన ప్రచారంతో ప్రధాన పార్టీలకు గట్టి సవాల్ విసురుతున్నారు. సాధారణ ప్రచారానికి భిన్నంగా... ఒక మరగుజ్జు తన ప్రత్యేక వాహనంతో ప్రచారంలో పాల్గొనడం ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ విభిన్నమైన శైలితో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఓటర్లను ఆకట్టుకుంటూ ముందుకుసాగుతోంది. రెండో వార్డులో ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉండగా, ఈదునూరి సరిత రంగ ప్రవేశంతో రాజకీయ సమీకరణలు మారుతున్నాయనే చర్చ మొదలైంది. ముఖ్యంగా కత్తెర గుర్తు ఓటర్లలో చర్చనీయాంశంగా మారింది. ఇది ప్రధాన పార్టీలకు తలనొప్పిగా పరిణమించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సరిత వినూతన ప్రచారంతో రెండో వార్డులో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.



# చక్రాపూర్‌లో ఘనంగా శివ స్వాముల పూజ

హాజరైన బీఆర్ఎస్ నేత సరోజ్ రెడ్డి.. నిర్వాహకుల ఘన స్వాగతం



**దేవరకద్ర, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని మూసాపేట్ మండలం చక్రాపూర్‌లో గురువారం శివ స్వాముల పూజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి హాజరయ్యారు. అక్కడ జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా పూజా నిర్వాహకులు సరోజ్ రెడ్డికి ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రఘురాములు, వార్డు సభ్యులు, శివ స్వాములు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 7న తూప్రాన్‌కు హరీష్ రావు

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్న మాజీ మంత్రి

అల్లాపూర్ చౌరస్తా నుంచి భారీ ర్యాలీ.. బస్టాండ్ వద్ద బహిరంగ సభ

ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు



**తూప్రాన్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఈ నెల 7న తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి రానున్నారని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సతీష్ చారి తెలిపారు. హరీష్ రావు పర్యటన నేపథ్యంలో గురువారం నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సతీష్ చారి మాట్లాడుతూ... ఫిబ్రవరి 7న సాయంత్రం 3 గంటలకు అల్లాపూర్ చౌరస్తా నుంచి ప్రచార ర్యాలీ ప్రారంభమవుతుందని వివరించారు. అక్కడి నుంచి పెట్రోల్ పంప్, నర్సాపూర్ చౌరస్తా, సినిమా టాకీస్ రోడ్, కింది వాడ కట్టు, గాంధీ బొమ్మ, మసీదు మీదుగా బస్టాండ్ వరకు ఈ ర్యాలీ సాగుతుందని తెలిపారు. ర్యాలీ అనంతరం బస్టాండ్ సమీపంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు వేల సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏర్పాట్ల పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సర్రాఫ్ సతీష్ చారి, మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్, గొర్రె వెంకట్ రెడ్డి, సామల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలను పట్టణాలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

నిర్వాసితులకు అండగా బీఆర్ఎస్.. అభివృద్ధికి బాటలు

దేశంలో ఎక్కడా లేని విధంగా పరిహారం

11వ వార్డు ప్రచారంలో అభ్యర్థి భవాని కరుణాకర్



**గజ్వేల్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** సిద్దిపేట జిల్లా గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న సాగర్ పునరావాస గ్రామాల అభివృద్ధి కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమవుతుందని 11వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కొలిచెలిమి భవాని కరుణాకర్ స్పష్టం చేశారు. గురువారం లక్ష్మాపూర్, సంగాపూర్, బ్రాహ్మణ బంజరుపల్లి గ్రామాల్లో ఆమె ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కారు గుర్తుకు మద్దతు తెలిపారు. దేశంలో ఏ ప్రాజెక్టులోనూ లేని విధంగా మల్లన్న సాగర్ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవడమే కాకుండా, వారిని గౌరవప్రదమైన జీవన స్థాయికి తీసుకువచ్చే బాధ్యతతో బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందని తెలిపారు. పునరావాస గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, గృహ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలు కల్పించి, పల్లెలను పట్టణాలుగా మార్చిన ఘనత కేసీఆర్ పాలనకే దక్కుతుందన్నారు. ఆర్థికంగానే కాకుండా సామాజికంగా కూడా నిర్వాసిత కుటుంబాలకు భరోసా ఇచ్చిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. సంగాపూర్ మరింత అభివృద్ధి చెందాలన్నా, ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరకాలన్నా 11వ వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్‌గా గెలిచిన వెంటనే ప్రతి కాలనీ, ప్రతి వీధిలో మిగిలిపోయిన అభివృద్ధి పనులను పూర్తి బాధ్యతతో చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచెలిమి స్వామి, వార్డు ఇన్‌చార్జ్, మాజీ ఎంపీపీ రాగల దుర్గయ్య, అంకిరెడ్డిపల్లి సర్పంచ్ బాలయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వెంకటేశం, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే

- ఖర్చు వివరాలు అబ్జర్వర్లకు సమర్పించాలి
- వాహనాలకు అనుమతి తప్పనిసరి
- పెద్దపల్లిలో అభ్యర్థులకు అవగాహన సదస్సు




**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో గురువారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని 36 వార్డులకు గాను నామినేషన్ వేసిన 157 మంది అభ్యర్థులు ఇందులో పాల్గొన్నారు. రాష్ట్ర ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ పద్మజ రాణి, ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ సుజాత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ.. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల అబ్జర్వర్, అసిస్టెంట్ అబ్జర్వర్‌కు సమర్పించాలని సూచించారు. ప్రచార వాహనాలకు మున్సిపాలిటీ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ వేసిన అభ్యర్థి, వారి ఏజెంట్ల వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించి ఐడెంటిటీ కార్డులు (గుర్తింపు కార్డులు) పొందాలన్నారు. పోలింగ్ రోజున రిటర్నింగ్ ఆఫీసర్ అనుమతి, ఐడెంటిటీ కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల విధులు ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని, రిటర్నింగ్ అధికారి వద్ద ఇవి అందుబాటులో ఉంటాయని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేయాలన్నారు. అలాగే 36 వార్డులకు సంబంధించిన ఓటర్ చిట్టీలను వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

# రిటర్నింగ్ అధికారుల వద్ద పోస్టల్ బ్యాలెట్లు



- ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి
- మున్సిపల్ ఆఫీసులో పోస్టల్ బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు
- రాజకీయ పార్టీల భేటీలో కమిషనర్ ఆకుల వెంకటేష్

**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, సహాయ ఎన్నికల అధికారి ఆకుల వెంకటేష్ పోస్టల్ బ్యాలెట్లపై కీలక విషయాలు వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డుల వారీగా రిటర్నింగ్ అధికారుల వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అందుబాటులో ఉన్నాయని కమిషనర్ తెలిపారు. వేరే ప్రాంతాల్లో ఎన్నికల విధులు (ఎలక్షన్ డ్యూటీ) పడిన ఉద్యోగులు సంబంధిత వార్డు రిటర్నింగ్ అధికారిని సంప్రదించి, పోస్టల్ బ్యాలెట్ పొందవచ్చని సూచించారు. ఇందుకోసం కార్యాలయంలో ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీల నాయకుల ముందే బాక్స్‌ను తెరిచి చూపించి, అనంతరం వారి సమక్షంలో సీల్ వేశారు. ఈ బాక్స్‌ను ఓట్ల లెక్కింపు రోజైన 2026, ఫిబ్రవరి 13న ఏజెంట్ల సమక్షంలోనే తెరుస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. వార్డుల వారీగా ఓటరు స్లిప్పుల (పోలింగ్ చిట్టీలు) పంపిణీ చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) ద్వారా ప్రతి ఇంటికీ వీటిని పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, కిరణ్, మాస్టర్ ట్రైనర్ కృష్ణారెడ్డి, మున్సిపల్ అకౌంటెంట్ నాగవేణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చేతుల్లో పనిముట్లు కాదు.. పుస్తకాలు ఉండాలి

- భిక్షాటన చేస్తున్న ఐదుగురు పిల్లలకు విముక్తి
- వెంటనే పాఠశాలలో చేర్పించిన అధికారులు
- బాలకార్మికులు కనిపిస్తే 1098కు కాల్ చేయండి



**నార్సింగి, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** దేశ భవిష్యత్తు బాలల చేతుల్లోనే ఉందని, నేటి బాలలే రేపటి పౌరులని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఓఆర్డబ్ల్యూ డి. శంకర్ గౌడ్, విజన్ ఎన్జీవో ప్రతినిధి కండ్లకోయ యాదగిరి అన్నారు. మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలో గురువారం భిక్షాటన చేస్తున్న ఐదుగురు పిల్లలను గుర్తించి, వారికి విముక్తి కల్పించి పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాల్యంలో పిల్లల చేతుల్లో పుస్తకాలు ఉండాలి తప్ప, పనిముట్లు కాదని హితవు పలికారు. బాల్యాన్ని ఆస్వాదిస్తూ, చదువుకునే హక్కు ప్రతి చిన్నారికీ ఉందని, ఆ హక్కుల పరిరక్షణలో భాగంగానే నేడు వీరిని పాఠశాలలో చేర్పించామని వివరించారు. సమాచారం ఇవ్వండి ఎక్కడైనా చిన్న పిల్లలు బడికి వెళ్లకుండా పనుల్లో కానీ, భిక్షాటనలో కానీ కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. తద్వారా ఆ బాలల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసిన వారవుతారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో నాగభూషణం, ఎంపీపీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు వాసవి, ఉపాధ్యాయ బృందం, జెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లోకి రావాలి

- మార్పు కోసమే కొత్తవారికి అవకాశం
- 20వ వార్డు అభ్యర్థి నవీన్‌ను గెలిపించండి
- ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి



**మెదక్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మార్పు రావాలంటే యువత రాజకీయాల్లోకి రావాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. మెదక్ పట్టణంలోని 20వ వార్డులో బీఆర్ఎస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి బొద్దుల నవీన్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... రాజకీయాల్లో కొత్తవారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే నవీన్‌ను అభ్యర్థిగా ఎంపిక చేశామని తెలిపారు. యువత చురుగ్గా ఉంటేనే సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని, వార్డు అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నవీన్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ.. ఉపాధి కల్పనే లక్ష్యం

**గొల్లపల్లి పెద్దమ్మతల్లిని దర్శించుకున్న 'జీ స్కిల్స్' అధినేత రమేష్**

**యువతకు అండగా నిలుస్తామని హామీ**

**సంస్థ విజయం కోసం ప్రత్యేక పూజలు**



**గొల్లపల్లి, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ముదిరాజ్ కుల దైవం పెద్దమ్మతల్లిని 'జీ స్కిల్స్' డెవలప్‌మెంట్ సంస్థ అధినేత ముంజంపెల్లి రమేష్ గురువారం దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఎందరో యువతీ యువకులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తమ సంస్థ ద్వారా సరైన నైపుణ్య శిక్షణ అందిస్తూ, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సదాశయంతోనే 'జీ స్కిల్స్' సంస్థను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ బృహత్తర కార్యక్రమంపై, సంస్థపై పెద్దమ్మతల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో పారదర్శకత ముఖ్యం

**క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలి**

**సిబ్బందికి ఎంపీడీవో దామోదర్ ఆదేశం**

**సామాజిక తనిఖీపై ప్రత్యేక సమీక్ష**




**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** సామాజిక తనిఖీ నిర్వహణలో భాగంగా ఉపాధి హామీ పథకం పనులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఎంపీడీవో దామోదర్ అధికారులను ఆదేశించారు. గురువారం చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్పీల ఆధ్వర్యంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... మండలంలోని 31 గ్రామ పంచాయతీలలో చేపట్టిన ఉపాధి హామీ పనుల నిర్వహణలో పారదర్శకత ఉందా లేదా అనేది పరిశీలించాలని సూచించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పనులను తనిఖీ చేసి, సమగ్ర నివేదికను అందజేయాలని సామాజిక తనిఖీ బృందానికి దిశానిర్దేశం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లోనే అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో వ్యవహరించాలని, నివేదికలను సకాలంలో అందజేయాలని స్పష్టం చేశారు. పనుల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, పలు కీలక అంశాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజకుమార్, డీఆర్పీలు నాగరాజు, అనిల్, సంజీవ, పాండు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

**చదువుతో పాటు వినయం, క్రమశిక్షణ ముఖ్యం**

**విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం**

**మురుమూరు పాఠశాలలో సర్పంచ్ మగ్గిడి స్వరూప**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** విద్యార్థులకు విద్యతో పాటు వినయం, క్రమశిక్షణ నేర్పించాలని, అప్పుడే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని మురుమూరు సర్పంచ్ మగ్గిడి స్వరూప శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మురుమూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... పాఠశాలకు వచ్చే పిల్లలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్న బియ్యం, ఆకుకూరలు, పప్పులు, గుడ్లు, పాలు వంటి సంపూర్ణ పౌష్టికాహారాన్ని ప్రతిరోజూ అందించాలని సిబ్బందికి సూచించారు. పిల్లలు ఇలాంటి ఆహారం తీసుకోవడం వల్ల శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. ఇంటి వద్ద కూడా పిల్లలు పోషకాహారం తీసుకునేలా చూడాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. చదువుతో పాటు క్రీడలు, క్రమశిక్షణ అలవరచాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన సమయంలో సర్పంచ్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వంట రుచిని, నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదండ్ల సుమన్ యాదవ్, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు బాల శివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 13వ వార్డు అభివృద్ధి నా బాధ్యత

- సమస్యలకు శాశ్వత పరిష్కారం
- సింహం గుర్తుపై గెలిపించండి: లయన్ డాక్టర్ జానకిరామ్
- మౌలిక వసతులు, పింఛన్లపై గట్టి హామీ
- ఆదర్శ వార్డుగా మారుస్తానని భరోసా



**తూప్రాన్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. వార్డు అభ్యర్థిగా బరిలో ఉన్న లయన్ డాక్టర్ జానకిరామ్ విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ప్రజల మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఎన్నికల్లో తనకు 'సింహం' గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గత కొన్నేళ్లుగా 13వ వార్డులో పేరుకుపోయిన సమస్యలను పూర్తిగా పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని జానకిరామ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం వార్డులో మురుగు కాలువలు (మోరీలు), సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నల్లా కనెక్షన్ల వ్యవస్థ సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. వార్డులోని మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని జానకిరామ్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వితంతు, ఒంటరి మహిళ, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లు తప్పకుండా అందేలా ప్రభుత్వంతో పోరాడి సాధిస్తానని భరోసా ఇచ్చారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా, ఉమ్మడి జిల్లా ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడిగా ఎన్నో ఏళ్లుగా తాను నిర్వహించిన సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆపదలో ఉన్నవారికి మానవత్వంతో అండగా నిలిచానని పేర్కొన్నారు. వార్డులోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములకు ఏ కష్టం వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానని, ప్రజల మధ్యే ఉంటూ వారి గొంతుకగా నిలుస్తానని మాటిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం, సేవాభావం అనే మూడు అంశాలతో 13వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ప్రచారంలో జానకిరామ్ వెంట వార్డు మహిళా ఓటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసారి సింహం గుర్తుకే ఓటేసి జానకన్నను గెలిపిస్తామని వారు నినదించారు.



# సేవ కోసమే మీ ముందుకు..

- 5వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- గత కౌన్సిలర్ అభివృద్ధిని గాలికి వదిలేశారు
- కాంగ్రెస్ అభ్యర్థి రాగి అశోక్ ప్రచారం



**మెదక్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మెదక్ పట్టణంలోని 5వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి రాగి అశోక్ గురువారం వార్డులో ముమ్మరంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి, వారికి సేవ చేయడానికే ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా రాగి అశోక్ మాట్లాడుతూ... గతంలో ఈ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఉన్న వ్యక్తి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. వార్డులో కనీస మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే వార్డు రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్ల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. వార్డులోని ప్రతి సమస్యను తీర్చి, మెదక్ పట్టణంలోనే 5వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 14వ వార్డులో గులాబీ జోరు

**కాంగ్రెస్ హామీలు నీటి మూటలే.. పథకాలకు మంగళం**

**ఇంటింటి ప్రచారంలో అభ్యర్థి రచనా ధన్‌రాజ్**

**మద్దతుగా నిలిచిన ఇన్‌చార్జ్ ఆంజనేయులు గౌడ్**



**తూప్రాన్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ 14వ వార్డులో గురువారం ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. వార్డు ఇన్‌చార్జ్, మల్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి పోతరాజు రచనా ధన్‌రాజ్ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తూప్రాన్ మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధిని, ప్రతి ఇంటికీ కేసీఆర్ అందించిన సంక్షేమ ఫలాలను ఈ సందర్భంగా ఓటర్లకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చిందని, గతంలో అమలైన సంక్షేమ పథకాలకు తిలోదకాలు ఇచ్చిందని విమర్శించారు. గడిచిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి బలపరిచిన అభ్యర్థి రచనా ధన్‌రాజును భారీ మెజారిటీతో గెలిపించాలని వార్డు ఇన్‌చార్జి ఆంజనేయులు గౌడ్, శివంపేట మాజీ ఎంపీపీ హరికృష్ణ కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు శ్రీకాంత్, గడ్డం శేఖర్, యాదగిరి, నరసింహులు, రమేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నం పెట్టింది కేసీఆరే.. రాష్ట్రాన్ని ఆగం చేసింది కాంగ్రెస్సే

- గజ్వేల్‌లో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు
- మూడు విడతల రైతు బంధు ఎగ్గొట్టారు
- అక్షింతలు వేయడం తప్ప బీజేపీ చేసిందేమీ లేదు
- కౌన్సిలర్ల ప్రచారంలో మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజం



**గజ్వేల్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** సిద్దిపేట జిల్లా గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై నిప్పులు చెరిగారు. గురువారం ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మున్సిపాలిటీలోని 2వ వార్డు అభ్యర్థి గోలి మమతా సంతోష్, 4వ వార్డు అభ్యర్థి మరికంటి వరలక్ష్మి కనకయ్య, 5వ వార్డు అభ్యర్థి మన్నే రూప వెంకటేష్, 6వ వార్డు అభ్యర్థి బొగ్గుల స్వప్న సురేష్‌లకు మద్దతుగా ఈ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... మనకు అన్నం పెట్టింది, పని కల్పించింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. పని చేసిన వారికే ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి ఎలా ఉండేదో, కేసీఆర్ పాలనలో అది ఎలా కార్పొరేట్ స్థాయికి మారిందో ప్రజలకు స్పష్టంగా తెలుసునన్నారు. కాంగ్రెస్ పాలన వచ్చాక అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, రాష్ట్రం ఆగమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజ్ఞాపూర్‌లో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌కు ఇప్పటికీ ప్రారంభోత్సవం చేయలేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఒక్క తట్టెడు మట్టి కూడా ఎత్తని పాలన ఇదని తీవ్రంగా విమర్శించారు. కరోనా లాంటి కఠిన సమయంలోనూ ఆగని రైతు బంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని హరీష్ రావు మండిపడ్డారు. ఇప్పటివరకు మూడు విడతల రైతు బంధు డబ్బులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. పొలాలకు నీళ్లు తెచ్చే ఆలోచన కేసీఆర్ చేస్తే, కాంగ్రెస్ నేతలు విమర్శలపైనే దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు. బంగారం ధర భారీగా పెరిగిందని, కానీ సామాన్యులకు ఇచ్చిన హామీలు మాత్రం అమలు కాలేదన్నారు. మహిళలకు ఒక మాట, పురుషులకు మరో మాట చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. మైనారిటీలకు కూడా ఈ పాలనలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీజేపీపై కూడా హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అక్షింతలు పంచడం తప్ప గజ్వేల్‌కు బీజేపీ చేసింది ఏమీ లేదని వ్యాఖ్యానించారు. రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ప్రజలు బలంగా నమ్ముతున్నారని, అప్పటివరకు మిగిలిపోయిన అభివృద్ధి పనులను తాము బాధ్యతగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గజ్వేల్ బాగుండాలంటే, అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ కౌన్సిలర్లను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సభలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ ప్రతాప్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# ఏడవ వార్డు గడ్డ.. పాషా సెట్ అడ్డా

**స్వతంత్ర అభ్యర్థిగా బరిలో పాషా సెట్**

**మాజీ జెడ్పీటీసీ కమల్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రచారం**

**పార్టీలకు అతీతంగా ప్రజల మద్దతు**



**జుక్కల్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీలోని ఏడవ వార్డులో స్వతంత్ర అభ్యర్థి పాషా సెట్ ప్రచారం జోరుగా సాగింది. సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ కమల్ కిషోర్ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొన్నేళ్లుగా పాషా సెట్ ఇక్కడ తిరుగులేని నాయకుడిగా ఉన్నారు. తన వార్డులో ఎవరిని నిలబెట్టినా ఒంటిచేత్తో గెలిపించగల సత్తా ఆయన సొంతం. గతంలో పార్టీలకు అతీతంగా ఎంతోమంది వార్డు సభ్యులను, ఎంపీటీసీలను గెలిపించిన సందర్భాలు కోకొల్లలు. ఎప్పుడూ ఇతరులను గెలిపించే ఆయన.. ఇప్పుడు బిచ్కుంద మున్సిపల్ ఎన్నికల్లో తానే స్వయంగా బరిలోకి దిగారు. స్థానిక ప్రజలకు తానున్నానంటూ భరోసా ఇస్తూ పాషా సెట్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. వార్డు ప్రజలు కూడా పార్టీలకు అతీతంగా ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రజల స్పందన, మద్దతు చూస్తుంటే ఏడవ వార్డులో పాషా సెట్ విజయం ఖాయమని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# దేవరకద్రలో బీజేపీ ముఖ్య నేతల భేటీ

**ఎన్నికల వ్యూహంపై సుదీర్ఘ చర్చ.. కార్యాచరణపై శ్రేణులకు దిశానిర్దేశం**

**హాజరైన ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్**



**దేవరకద్ర, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్, దేవరకద్ర మున్సిపాలిటీ ఎన్నికల ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ పవన్ కుమార్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అవలంబించాల్సిన వ్యూహాలు, కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో ఓటర్లను ఆకట్టుకోవడంపై నాయకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, బీజేపీ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు లక్ష్మి, 12 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మీ ఇంటి ఆడబిడ్డగా వచ్చా.. ఆశీర్వదించండి

**జగిత్యాల 19వ వార్డులో భారతి వినూత్న ప్రచారం**

**ఆర్భాటాలకు దూరంగా.. ప్రజలకు చేరువగా**

**అభివృద్ధే లక్ష్యమని అభ్యర్థి హామీ**



**గొల్లపెల్లి, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** జగిత్యాల పురపాలక సంఘం ఎన్నికల సమరం తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో 19వ వార్డులో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) అభ్యర్థి తుమ్మనపెల్లి భారతి సంతోష్ ప్రచారం ఆసక్తికరంగా మారింది. మైకుల మోత, ఆర్భాటాలు లేకుండా నిశబ్దంగా ప్రజల్లోకి వెళ్తున్న ఆమె తీరు విపక్షాలను కలవరపెడుతోంది. కేవలం ఓట్ల కోసమే వచ్చే నాయకుల్లా కాకుండా, ఆపదలో ఆదుకునే ఇంటి మనిషిలా ఆమె చేస్తున్న గడపగడప ప్రచారం ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఓటర్ల వద్దకు వెళ్లినప్పుడు ఆమె రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వడం లేదు. నేరుగా మహిళల చేతులు పట్టుకుని, వృద్ధుల పాదాలకు నమస్కరిస్తూ.. 'నేను మీ ఇంటి ఆడబిడ్డను.. మీ సోదరిని.. నన్ను ఆశీర్వదించండి' అంటూ ఆత్మీయంగా పలకరిస్తున్నారు. ఈ తీరుతో ఓటర్లు ఆమెను రాజకీయ నాయకురాలిగా కాకుండా సొంత మనిషిలా ఆదరిస్తున్నారు. మాటలు చెప్పే వారిని కాకుండా, కష్టపడి పనిచేసే వారిని గుర్తించాలని భారతి కోరారు. వార్డు సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, డ్రైనేజీలు, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనలో రాజీపడనని స్పష్టం చేశారు. కౌన్సిలర్ అంటే పెత్తనం చేసే వ్యక్తి కాదని, ప్రజలకు సేవకురాలని నిరూపిస్తానని శపథం చేశారు. కారు గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని భరోసా ఇచ్చారు. ఆమె నిజాయితీ, ప్రజలతో మమేకమవుతున్న తీరు చూస్తుంటే ఈసారి 19వ వార్డులో గులాబీ జెండా ఎగరడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# దేవరకద్ర దర్గాలో ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రత్యేక ప్రార్థనలు

**ఎన్నికల ప్రచారంలో భాగంగా సందర్శన**

**అభ్యర్థులు, కార్యకర్తలతో కలిసి హాజరు**



**దేవరకద్ర, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న దర్గాలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన దేవరకద్రలో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్గాకు వెళ్లిన ఆయన... అక్కడ జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు.

# మార్నింగ్ వాక్‌లో ప్రజల చెంతకు ఎమ్మెల్యే జీఎంఆర్

**దేవరకద్ర వీధుల్లో వినూత్న ప్రచారం**

**ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యల ఆరా**

**హస్తం గుర్తుకే ఓటేయాలని అభ్యర్థన**



**దేవరకద్ర, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో గురువారం మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) దేవరకద్ర పట్టణంలో మార్నింగ్ వాక్ చేస్తూ వినూత్న రీతిలో ప్రచారంలో పాల్గొన్నారు. ఉదయాన్నే దేవరకద్ర పురవీధుల్లో కలియతిరిగిన ఆయన సాధారణ ప్రజలతో నేరుగా ముచ్చటించారు. వాకింగ్ చేస్తున్న సమయంలో ఎదురైన స్థానికులు, వృద్ధులు, యువతను పలకరిస్తూ వారి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడమే తన మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. పట్టణ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దేవరకద్ర మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి, అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్యే స్వయంగా వీధుల్లోకి వచ్చి ప్రచారం చేయడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భాయ్.. చాయ్ బనానే కో చాన్స్ దో

**దేవరకద్రలో చాయ్ చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్**

**హోటల్ యజమానితో సరదా సంభాషణ**

**ఆకట్టుకున్న ప్రచార సరళి**



**దేవరకద్ర, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ఓ టీ కొట్టులో చాయ్ కలిపి అందరినీ ఆశ్చర్యపరిచారు.

**మహమూద్ భాయ్ కైసే హై..**

ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న మహిమూద్ చాయ్ హోటల్ వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న యజమానిని "మహమూద్ భాయ్ కైసే హై" అంటూ ఆప్యాయంగా పలకరించారు. "భాయ్.. చాయ్ బనానే కో చాన్స్ దో" (సోదరా.. టీ చేయడానికి అవకాశం ఇవ్వు) అంటూ గరిట పట్టి స్వయంగా టీ తయారు చేశారు. ఎమ్మెల్యే చాయ్ చేస్తున్న దృశ్యం అక్కడున్న వారిని, స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంది. ఎమ్మెల్యే తమ హోటల్ వద్దకు వచ్చి, తనతో సరదాగా మాట్లాడి స్వయంగా చాయ్ చేయడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని హోటల్ యజమాని మహిమూద్ పేర్కొన్నారు. ఇదో మధురమైన అనుభూతి అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

# చౌదర్‌పల్లికి బ్రహ్మోస్ మిస్సైల్ ఫ్యాక్టరీ

- యువతకు భారీగా ఉపాధి
- 12కు 12 స్థానాలు కాంగ్రెస్ కైవసం
- ఎమ్మెల్యే జీఎంఆర్ ధీమా
- చౌదర్‌పల్లి, బలుసుపల్లిలో ఎన్నికల ప్రచారం



**దేవరకద్ర, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని చౌదర్‌పల్లి, బలుసుపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. ఏడాదిలోనే ఇందిరమ్మ ఇళ్లు గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పాలకులు చౌదర్‌పల్లి, బలుసుపల్లి గ్రామాల్లో కనీసం ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇల్లు కానీ, ఒక్క రేషన్ కార్డు కానీ ఇవ్వలేదని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేశామని గుర్తుచేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. యువతకు ఉపాధి చౌదర్‌పల్లి గ్రామంలో బ్రహ్మోస్ మిస్సైల్ ఫ్యాక్టరీ రాబోతోందని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ ఫ్యాక్టరీ రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, చౌదర్‌పల్లి ప్రాంతం కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి, అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేవరకద్ర ప్రజల మద్దతుతో మొత్తం 12 సీట్లకు 12 సీట్లు కాంగ్రెస్ పార్టీనే కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అధికార పార్టీకి అండగా నిలిచి అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- గత పాలకులకు కమిషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదు
- అండర్ పాస్ లేకుండా ఫ్లైఓవర్ కట్టి ఊరును రెండుగా చీల్చారు
- ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు
- మున్సిపల్ ప్రచారంలో ఎమ్మెల్యే జీఎంఆర్



దేవరకద్ర, ఫిబ్రవరి 5 (ఇదే నిజం): గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ఆరోపించారు. దేవరకద్ర మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జీఎంఆర్ పట్టణ పురవీధుల గుండా పర్యటించి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేసి, అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దేవరకద్ర పట్టణ అభివృద్ధిని గాలికి వదిలేశారని ఎమ్మెల్యే విమర్శించారు. కేవలం కమిషన్లు వచ్చే పనులపైన దృష్టి పెట్టారు తప్ప, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయలేదని మండిపడ్డారు. అండర్ పాస్ నిర్మించాల్సిన చోట అనాలోచితంగా ఫ్లైఓవర్ నిర్మించి దేవరకద్రను రెండుగా చీల్చారని గత ప్రభుత్వ తీరును ఎండగట్టారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా నియోజకవర్గ కేంద్రానికి డిగ్రీ కాలేజీ, ఆసుపత్రి, కోర్టు తీసుకురాలేకపోయారని, కనీసం దేవరకద్రను మున్సిపాలిటీగా కూడా గుర్తించలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దేవరకద్రలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశామని, భవన నిర్మాణానికి రూ. 6 కోట్ల నిధులు కేటాయించామని జీఎంఆర్ తెలిపారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇప్పటికే 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు మొదలయ్యాయని, త్వరలోనే కోర్టు కార్యకలాపాలు కూడా ప్రారంభం కానున్నాయని చెప్పారు. ఇటీవల రూ. 25 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు, రూ. 5 కోట్లతో నూతన మున్సిపల్ ఆఫీస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు.

**సంక్షేమమే ధ్యేయం**

బీఆర్ఎస్ హయాంలో దేవరకద్ర పట్టణంలో ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇల్లు కానీ, ఒక్క రేషన్ కార్డు కానీ ఇవ్వలేదని ఎమ్మెల్యే విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొదటి విడతలో 77 ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేశామని, ఏప్రిల్ నెలలో రెండో విడత ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేసిన రూ. 8 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు కడుతూనే... మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 2 లక్షల రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏటా రూ. 13 వేల కోట్లు వెచ్చించి రేషన్‌పై సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. దేవరకద్ర అభివృద్ధి చెందాలంటే అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, అభివృద్ధికి బాటలు వేయడానికి కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్ రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి, కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి

- రూ. 10 లక్షలతో డ్వాక్రా భవన నిర్మాణం
- ఘనంగా భూమిపూజ చేసిన ఆవుల గోపాల్ రెడ్డి
- జంగరాయిని ఆదర్శ గ్రామంగా మారుస్తాం



**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** ఎమ్మెల్యే రోహిత్ రావు సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆవుల గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి గ్రామంలో ఎమ్మెల్యే నిధులు రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్వాక్రా మహిళా సంఘం భవనానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. పాలకవర్గ సభ్యులు, డ్వాక్రా మహిళలతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామ అభివృద్ధికి గ్రామస్తులంతా సహకరించాలని కోరారు. అందరి కృషితో జంగరాయి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు కమ్మరి కిష్టయ్య, పి. శ్యామ్, రజిత, సురేష్, సబిత, డ్వాక్రా మహిళా సంఘం మండల అధ్యక్షురాలు సౌజన్య, వీవోలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘ భవనానికి మోక్షం

- రూ. 10 లక్షలతో నిర్మాణం
- ఘనంగా భూమిపూజ చేసిన సర్పంచ్ భవాని అరవింద్
- ఈజీఎస్ నిధుల ద్వారా పనులు



**గొల్లపల్లి, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించనున్న మహిళా గ్రామ సంఘ భవనానికి గురువారం సర్పంచ్ కాసరపు భవాని అరవింద్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. భవన నిర్మాణం కోసం ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) నిధుల ద్వారా రూ. 10 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మహిళల స్వయం శక్తికి, సంఘాల బలోపేతానికి ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పనులను నాణ్యతతో పూర్తి చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిరవేణి రవి, వార్డు సభ్యులు బొమ్మెల మధు, బుర్ర తిరుపతి, శ్రీపతుల లత, కాళ్ళ జామున, ఎండ్రికాయల గంగాధర్, కోమల్ల హనుమంతు, గ్రామ సంఘాల అధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శి నరేష్, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, వీవోఏలు నీరజ, జీవన్, మల్లీశ్వరి, ఎఫ్ఏ మహేందర్ రెడ్డి, టీఏ రాజేందర్, పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- షెడ్యూల్ ప్రకారమే నిర్వహణ
- కౌంటింగ్ తర్వాత మేయర్, చైర్‌పర్సన్ ఎన్నికకు సిద్ధం కండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని




**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** పురపాలక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై గురువారం ఆమె ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్లకు కమిషనర్ సూచించారు. పోలింగ్‌కు అవసరమైన మేర బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్ బృందాలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటులో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్‌లలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ ముగిసిన వెంటనే మున్సిపాలిటీలలో చైర్‌పర్సన్, కార్పొరేషన్లలో మేయర్ ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుందని, ఇందుకోసం ఫారం 2ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు దీనిపై ముందుగానే సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, గోదావరిఖని ఏసీపీ రమేష్, ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి అభివృద్ధికి రూ. 17 కోట్లు

- ఫ్లై ఓవర్ కింద బాక్స్ క్రికెట్, ఫుట్‌బాల్ కోర్టులు
- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో రూ. 17 కోట్ల 33 లక్షల 80 వేల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు.డివిజన్ పరిధిలోని తారానగర్, రైల్ విహార్, హుడా ట్రేడ్ సెంటర్, సురభి కాలనీ, భాగ్యలక్ష్మి ఎన్‌క్లేవ్, మారుతి నగర్, మాధవ హిల్స్, స్ప్రింగ్ వ్యాలీ, వుడ్ ల్యాండ్ ప్రీమియర్, శిల్ప గార్డెన్, సెంట్రల్ పార్క్ ఫేస్–1, 2, పెరల్ విలేజ్, క్యామ్లెట్ లేఅవుట్, క్రాంతి వనం కాలనీల్లో సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, షటిల్, బ్యాడ్మింటన్ కోర్టులు, పార్క్ ప్రహరీ గోడల నిర్మాణానికి గాంధీ శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. నల్లగండ్ల ఫ్లై ఓవర్ కింద యువత కోసం బాక్స్ క్రికెట్, ఫుట్‌బాల్ కోర్ట్, బ్యాడ్మింటన్, షటిల్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత జీవన విధానంలో వ్యాయామం ఎంతో అవసరమని, ఆరోగ్యం బాగుంటే మనిషి ఏదైనా సాధించగలడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, వీరేశం గౌడ్, అనిరుధ్ యాదవ్, తరుణ్ గౌడ్, రవి యాదవ్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# అవినీతికి తలుపులు మూయాలి.. అభివృద్ధికి ద్వారాలు తెరవాలి

- గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో మార్పు తథ్యం: ఎమ్మెల్సీ అంజిరెడ్డి
- ప్యాకేజీల కోసం పోరాడతా: అభ్యర్థి శశిధర్ రెడ్డి
- 7వ వార్డులో బీజేపీ ముమ్మర ప్రచారం



**గజ్వేల్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా 7వ వార్డులో బీజేపీ ప్రచారం ఊపందుకుంది. సింగారం, ఎర్రవల్లి ప్రాంతాల్లో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మన్నెం శశిధర్ రెడ్డి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరై కమలం గుర్తుకు మద్దతు కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ... మున్సిపాలిటీలో ప్రజలు నిజమైన మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన పాలన ప్రజల కనీస అవసరాలను తీర్చలేకపోయిందని విమర్శించారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో మార్పు రావాలంటే అవినీతికి తలుపులు మూసి, అభివృద్ధికి ద్వారాలు తెరవాలని, ఆ శక్తి ఒక్క బీజేపీకే ఉందని స్పష్టం చేశారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు ఏళ్లుగా పరిష్కారం కాకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ ఎన్నికలు కేవలం పదవుల కోసం కాదని, 7వ వార్డు భవిష్యత్తు కోసమని పేర్కొన్నారు. అభ్యర్థి మన్నెం శశిధర్ రెడ్డి మాట్లాడుతూ... తనను గెలిపిస్తే 7వ వార్డులోని ప్రతి వీధిని, ప్రతి కాలనీని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సింగారం, ఎర్రవల్లి నిర్వాసితులకు రావాల్సిన పెండింగ్ పరిహారాలు, ప్యాకేజీల కోసం రాజీలేకుండా పోరాడతానని భరోసా ఇచ్చారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను ప్రణాళికాబద్ధంగా కల్పిస్తానన్నారు. సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా, ప్రజల మధ్యే ఉండి పనిచేస్తానని స్పష్టం చేశారు. అవినీతికి తావులేని జవాబుదారీ పాలన అందిస్తానని, కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రాక్టికల్స్‌లో మాస్ కాపీయింగ్.. క్రిమినల్ కేసులు పెట్టాలి

**కార్పోరేట్ కాలేజీల అక్రమాలపై ఎస్ఎఫ్ఐ ధర్నా**

**సీసీ కెమెరాలు ఆపేసి మరీ చిట్టీల పంపిణీ**

**యాజమాన్యాలను అరెస్ట్ చేయాలని డిమాండ్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 5:** ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన కార్పోరేట్ కళాశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఇంటర్ బోర్డు కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రజినీకాంత్, నాగరాజు మాట్లాడుతూ.. శ్రీ చైతన్య, నారాయణ, ఎస్ఆర్, రెసోనెన్స్, ఎంఎస్ తదితర కార్పోరేట్ కాలేజీలు ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేశాయని ఆరోపించారు. సీసీ కెమెరాలు పనిచేయకుండా చేసి, ఎగ్జామినర్ల ద్వారానే చిట్టీలు అందించి పరీక్షలు రాయించారని మండిపడ్డారు.ప్రభుత్వ కాలేజీల్లో నిబంధనలు పాటిస్తూ, కార్పోరేట్ కాలేజీల అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారని విమర్శించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన కాలేజీల అనుమతులు రద్దు చేసి, వాటిని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జయప్రదకు వినతిపత్రం అందజేశారు.

# 15వ వార్డు అభివృద్ధి కోసమే నా ఆరాటం

**ప్రజాపాలన, సంక్షేమమే మా అజెండా**

**ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ**

**నిధుల మంజూరుతో తూప్రాన్‌కు కొత్త కళ**



**తూప్రాన్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో గురువారం కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా సాగింది. వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కొడిప్యాక అన్నపూర్ణ నారాయణ గుప్త ఇంటింటికీ తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న ప్రజాపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా వార్డు ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ హయాంలో తూప్రాన్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఇటీవలే ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు. వార్డు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని, హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొడిప్యాక నారాయణ గుప్త, ఉమర్, సమీర్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# కారు గుర్తుకు ఓటేయండి.. అభివృద్ధిని గెలిపించండి

**కాంగ్రెస్ హామీలు నీటి మూటలే.. గత రెండేళ్లలో పేదలకు చేసిందేమీ లేదు**

**3వ వార్డులో బైరం సత్యలింగం ప్రచారం**



**తూప్రాన్, ఫిబ్రవరి 5 (ఇదే నిజం):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలోని 3వ వార్డులో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి బైరం సత్యలింగం గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, కేసీఆర్ అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చిందని, గద్దెనెక్కాక గతంలో ఉన్న సంక్షేమ పథకాలకు మంగళం పాడిందని సత్యలింగం విమర్శించారు. గడిచిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. మాటలకే తప్ప చేతలకు ఆ ప్రభుత్వం పనికిరాదని ఎద్దేవా చేశారు.మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి బలపరిచిన అభ్యర్థిగా తాను మీ ముందుకు వచ్చానని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని వార్డు ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్, తూప్రాన్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొల్లంపల్లి బాబుల్ రెడ్డి, అర్జున్, ప్రవీణ్, నర్సింలు, శాస నాగేంద్ర ప్రసాద్, వార్డు నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు: కలెక్టర్ ప్రతీక్ జైన్**

**నారాయణపూర్ శివారులో సభ స్థల పరిశీలన**

**7న పరిగికి రానున్న సీఎం రేవంత్ రెడ్డి**



**పరిగి, ఫిబ్రవరి 5:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 7న వికారాబాద్ జిల్లా పరిగి మండల పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం జిల్లా అధికారులతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిగి మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామ శివారులో సభ ఏర్పాట్లు జరుగుతున్న ప్రాంతాన్ని ఆయన సందర్శించారు.సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, వేదిక, బారికేడ్లు, వాహనాల పార్కింగ్, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లను నిర్ణీత గడువు కంటే ముందే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బహిరంగ సభకు వచ్చే వారు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.ముఖ్యమంత్రి భద్రతకు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పర్యటన నేపథ్యంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని, ముందస్తుగానే పనులన్నీ పూర్తి చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజేశ్వరి, డీఎస్పీ శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీనివాస్, ఆర్ అండ్ బి శ్రీధర్ రెడ్డి, ఆర్డీవో వాసు చంద్ర, తహసీల్దార్ వెంకటేశ్వరి, ఈవెంట్ మేనేజర్ ప్రకాష్, సంబంధిత అధికారులు ఉన్నారు.

# బెంగళూరుదే డబ్ల్యూపీఎల్ కిరీటం

**మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 టైటిల్ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జైత్రయాత్ర కొనసాగింది. గురువారం రాత్రి వడోదరలోని బీసీఏ స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠభరితమైన ఫైనల్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పై 6 వికెట్ల తేడాతో ఆర్సీబీ ఘన విజయం సాధించింది. వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్, ఈసారి కూడా రన్నరప్‌గానే మిగిలిపోగా, స్మృతి మంధాన సేన రెండోసారి ట్రోఫీని ముద్దాడి చరిత్ర సృష్టించింది. 204 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆర్సీబీ 19.4 ఓవర్లలోనే ఛేదించి సత్తా చాటింది.**

## ఢిల్లీకి మళ్లీ నిరాశే.. ఫైనల్ పోరులో ఆర్సీబీ ఘన విజయం

## స్మృతి మంధాన కెప్టెన్ ఇన్నింగ్స్.. దక్కని ఢిల్లీ పోరాటం

### 203 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన ఛాలెంజర్స్



టాస్ గెలిచిన ఆర్సీబీ బౌలింగ్ ఎంచుకోగా, ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఢిల్లీ బ్యాటర్ లారా వోల్వార్ట్ 25 బంతుల్లో 44 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు గట్టి పునాది వేసింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా దూకుడుగా ఆడారు. ఇన్నింగ్స్ చివరిలో చినెల్ హెన్రీ విశ్వరూపం చూపించింది. కేవలం 15 బంతుల్లోనే 35 పరుగులు చేసి అజేయంగా నిలిచి, స్కోరును 200 దాటించడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, ఇంత భారీ స్కోరు చేసినా, బౌలర్లు దానిని కాపాడుకోవడంలో విఫలమవడం ఢిల్లీకి శాపంగా మారింది. ఫైనల్ ఒత్తిడిని జయించలేక ఢిల్లీ బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చారు.

#### స్మృతి మంధాన సేన రికార్డు ఛేదన

204 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఆరంభంలోనే షాక్ తగిలింది. స్టార్ ప్లేయర్ గ్రేస్ హారిస్ తొలి బంతికే (గోల్డెన్ డక్) హెన్రీ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యింది. కానీ, ఆ తర్వాత జరిగినది అసలు సిసలైన పోరాటం. కష్టకాలంలో క్రీజులో నిలిచిన కెప్టెన్ స్మృతి మంధాన, జార్జియా వోల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. స్మృతి మంధాన అద్భుతమైన బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. నందిని శర్మ వేసిన ఒకే ఓవర్‌లో 4, 4, 6 బాది ప్రత్యర్థి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. తన అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టును గెలిపించిన స్మృతి మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది.

#### చివరి ఓవర్ ఉత్కంఠ


మ్యాచ్ చివరి వరకు ఉత్కంఠగా సాగినా, ఆర్సీబీ బ్యాటర్లు సంయమనం కోల్పోలేదు. 19.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసి విజయాన్ని అందుకోగా, మైదానం మొత్తం 'ఆర్సీబీ.. ఆర్సీబీ' నినాదాలతో హోరెత్తింది. ఫైనల్ మ్యాచ్‌లో 200 పైచిలుకు స్కోరును కాపాడుకోలేకపోవడం ఢిల్లీ బౌలింగ్ లోపాలను ఎత్తిచూపుతోంది. ముఖ్యంగా పవర్ ప్లే తర్వాత వికెట్లు తీయడంలో వారు విఫలమయ్యారు. వరుసగా ఫైనల్స్ ఓడిపోతున్నామన్న మానసిక ఒత్తిడి ఢిల్లీ ఫీల్డింగ్, బౌలింగ్‌లో స్పష్టంగా కనిపించింది. వడోదర పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామంగా మారింది. మంచు ప్రభావం కూడా ఛేజింగ్ చేసే జట్టుకు కలిసి వచ్చింది. మొత్తానికి, మహిళల క్రికెట్‌లో ఆర్సీబీ తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకోగా, ఢిల్లీకి మాత్రం కప్పు ఊరించి ఉసురుమనిపించింది.



# సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

## అనురాగ్ ఠాకూర్‌పై నిషేధం ఎత్తివేత!

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వ్యవహారాల్లో పాల్గొనకుండా మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్‌పై విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టు ఎత్తివేసింది. ఈ మేరకు నేడు (ఫిబ్రవరి 5) సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు 2017 జనవరి ఆదేశాలను సవరించి ఇకపై నియమాలు, నిబంధనలకు అనుగుణంగా ఠాకూర్ బీసీసీఐ కార్యకలాపాల్లో పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. 2017 జనవరిలో సుప్రీంకోర్టు అనురాగ్ ఠాకూర్‌ను బీసీసీఐ వ్యవహారాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది. అప్పుడు ఐసీసీ మాజీ చైర్మన్ శశాంక్ మనోహర్‌కు లేఖ రాసిన విషయంపై తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో సుప్రీంకోర్టు అవమాన, అబద్ధ ప్రమాణం కేసులు నమోదు చేసింది. ఆ తర్వాత ఠాకూర్ వ్యక్తిగతంగా కోర్టులో హాజరై క్షమాపణ తెలిపారు. దీంతో 2017 జూలై 14న సుప్రీంకోర్టు ఆయనపై కేసులను రద్దు చేసింది. ఇప్పుడు ఠాకూర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తి జోయ్‌మాల్య బాగ్చి ధర్మాసనం "డాక్టరీని అఫ్ ప్రోపోర్టివ్నాలిటీ" సూత్రాన్ని వర్తింపజేసి పాత ఆదేశాలను సవరించింది. ఠాకూర్ క్షమాపణ చెప్పిన విషయాన్ని కూడా కోర్టు పరిగణలోకి తీసుకుంది.



# భారత్‌ను ఓడించే సత్తా వారికి మాత్రమే ఉంది

## టీ20 వరల్డ్ కప్‌పై చహల్ ఆసక్తికర వ్యాఖ్యలు..

టీమిండియాలో అనుభవజ్ఞుడైన స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ చాలా కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ౠ20 వరల్డ్ కప్ 2024 జట్టులో ఉన్నప్పటికీ ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. చహల్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ 2023 ఆగస్టులో వెస్టిండీస్‌తో జరిగింది. అయితే.. తాజాగా ఓ జాతీయ మీడియా సంస్థ ప్రోగ్రామ్‌లో చహల్ పాల్గొన్నాడు. తన కెరీర్, టీమ్ ఇండియా భవిష్యత్తు, సోషల్ మీడియా ట్రోలింగ్, రిటైర్మెంట్ ప్లాన్‌ల గురించి మనసు విప్పి మాట్లాడాడు. ఆ మాటల్లో ఆత్మవిశ్వాసం, బాధ భారత క్రికెట్‌పై నమ్మకం కనిపించింది. కాగా.. ఈ ప్రోగ్రామ్‌లో 2026 టీ20 వరల్డ్‌కప్ గురించి చహల్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తికరంగా మారాయి. "భారతదేశం తన చేతిలోనే తానే ఓడిపోతుంది. మనం తప్పు చేస్తేనే ఓడిపోతాం. మిగతా జట్లు మనల్ని ఓడించే స్థాయిలో లేవు." అని తెలిపాడు. ప్రస్తుతం వరల్డ్ కప్ టీం గురించి ప్రస్తావిస్తూ.. టీమ్‌లో అనుభవం ఉన్న ఆటగాళ్లు, కొత్త ఉత్సాహంతో ఉన్న యువకులు ఉన్నారు. జట్టు బలంగా ఉందని చెప్పుకొచ్చాడు. చహల్ ట్రోలింగ్స్‌పై స్పందించాడు. తనకు ట్రోలింగ్స్ పెద్దగా బాధ పెట్టవని చెప్పాడు. కానీ కొందరు తన పేరుతో ఇతరుల పేర్లు కలిపి వ్యక్తిగత కథలు అల్లుతారు. అది మాత్రం బాధగా ఉంటుందని వెల్లడించాడు. అయినా ఇలాంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వకుండా క్రికెట్‌పైనే దృష్టి పెడుతున్నట్లు తెలిపాడు. రిటైర్మెంట్‌పై వస్తున్న వార్తలపై చహల్ వివరణ ఇచ్చాడు. "ఇంకా 5ఉ6 సంవత్సరాలు ఆడాలనుకుంటున్నాను. మైదానంలోకి వెళ్లినప్పుడు ఆనందం, ఆడాలనే తపన ఉంటే చాలు. అప్పటివరకు క్రికెట్‌నే నా ప్రపంచం" అని స్పష్టం చేశాడు. 35 ఏళ్ల వయసులోనూ అతనిలో ఉన్న ఆత్మవిశ్వాసం అభిమానులకు ధైర్యం ఇస్తోంది. అయితే.. బౌలర్ల గురించి మాట్లాడుతూ.. జస్ప్రీత్ బుమ్రాను ప్రపంచంలోనే నంబర్ వన్ బౌలర్‌గా అభివర్ణించాడు. హార్దిక్ పాండ్యాను జట్టుకు అత్యంత కీలకమైన ఆల్‌రౌండర్ అని తెలిపాడు. తిలక్ వర్మ, అభిషేక్ శర్మ లాంటి యువ ఆటగాళ్లను ప్రత్యేకంగా మెచ్చుకున్నాడు. వాళ్లలో దూకుడు ఆలోచన ఉందని, అదే టీమ్‌కి కొత్త శక్తినిస్తోందని అన్నాడు. కెప్టెన్సీ గురించి కూడా చహల్ ఓ ఆసక్తికర మాట చెప్పాడు. కెప్టెన్ ఎవరు అన్నది పెద్ద విషయం కాదు. ఆటగాళ్లు తమ ఆటపై దృష్టి పెట్టాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

# పాకిస్థాన్‌తో ఆడేందుకు భారత్ సిద్ధం..

## కొలంబో ఫ్లైట్ బుక్ అయింది!


### ఫిబ్రవరి 15న భారత్-పాకిస్థాన్ మ్యాచ్

### సూర్యకుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు



టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా ఫిబ్రవరి 15న జరగాల్సిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌పై ఉత్కంఠ నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలనే నిర్ణయంపై స్పందించిన సూర్య.. పాక్‌తో మ్యాచ్ ఆడేందుకు టీమిండియాకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశాడు. ఐసీసీ నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్ ఆడేందుకు సిద్ధమని, భారత్ ఎప్పుడూ పాక్‌తో ఆడేందుకు నిరాకరించలేదని వెల్లడించాడు. పాకిస్థాన్ ప్రభుత్వం బంగ్లాదేశ్‌కు మద్దతుగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం మరింత రాజకీయ రంగు పులుముకుంది. దీంతో ఐసీసీ ఈ అంశాన్ని ఎలా పరిష్కరిస్తుందన్న దానిపై ఆసక్తి పెరిగింది. భారత్, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉండగా.. శ్రీలంకతో కలిసి భారత్ ఈ టోర్నీకి ఆతిథ్యం వహిస్తోంది. భారత్ఉపాక్ మ్యాచ్‌ను కొలంబోలో నిర్వహించాలని ఐసీసీ ముందుగానే నిర్ణయించింది. ముంబైలో మీడియాతో సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ 'మా మైండ్‌సెట్ చాలా క్లియర్. మేము పాక్‌తో ఆడేందుకు ఎప్పుడూ నిరాకరించలేదు. పాక్ వైపు నుంచి నిర్ణయం తీసుకున్నారు. ఐసీసీ ఫిక్చర్ ఇచ్చింది, ప్రభుత్వాలు న్యూట్రల్ వేదికను నిర్ణయించాయి. కొలంబోకి మా ఫ్లైట్ ఇప్పటికే బుక్ అయింది. మ్యాచ్ కోసం మేము వెళ్తాం కూడా. ఆ తర్వాత ఏమవుతుందో మా చేతుల్లో లేదు' అని అన్నారు. భారత్‌తో మ్యాచ్‌ను పాకిస్థాన్ బహిష్కరిస్తే.. పాక్ జట్టు రెండు పాయింట్లు కోల్పోయే అవకాశముంది. అయితే దీనికి మించి పీసీబీపై ఐసీసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇంకా స్పష్టత లేదు. పాకిస్థాన్‌పై బ్యాన్ విధించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అలానే ఏ టీమ్ కూడా పాక్ వెళ్లకుండా ఆదేశాలు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. అలానే పీఎస్ఎస్ టోర్నీలో కూడా విదేశీ ప్లేయర్స్ ఆడకుండా కూడా ఐసీసీ బ్యాన్ చేయనుంది. మెగా టోర్నమెంట్ ప్రారంభానికి ముందే ఈ వివాదం చోటుచేసుకోవడంతో.. టీ20 వరల్డ్ కప్ 2026పై ప్రపంచ క్రికెట్ వర్గాల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# ఈసారి టీ20 వరల్డ్ కప్ మాదే..



## పాకిస్థాన్ కెప్టెన్ ఆసక్తికర వ్యాఖ్యలు!

### 2021 తర్వాత మేము ఐసీసీ ట్రోఫీలు గెలవలేకపోయాం

### మేము మంచి క్రికెట్ ఆడలేదు • అభిమానులను మేము నిరాశపర్చాం

పాకిస్తాన్ క్రికెట్ అభిమానులను ఉత్సాహపరిచే విధంగా సీనియర్ క్రికెటర్ సల్మాన్ అలీ ఆఘా కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో పాక్ జట్టు ఎదుర్కొన్న సవాళ్లు, ఫలితాలపై స్పందించారు. పాకిస్తాన్ కొన్ని ప్రధాన ట్రోఫీలు గెలవలేకపోయినప్పటికీ.. ఈ సారి కొత్త ఉత్సాహంతో ఆడేందుకు జట్టు సిద్ధంగా ఉందన్నాడు. ఈ సారి టీ20 వరల్డ్ కప్ గెలిచి పాకిస్తాన్ అభిమానులను సంతోషపెట్టాలని చూస్తున్నాం అని పాకిస్థాన్ కెప్టెన్ చెప్పాడు. సల్మాన్ అలీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సల్మాన్ అలీ ఆఘా మాట్లాడుతూ '2021 తర్వాత మేము ఐసీసీ ట్రోఫీలు గెలవలేకపోయాం. ఆసియా కప్, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కూడా గెలవలేదు. మేము మంచి క్రికెట్ ఆడలేదు. పాకిస్తాన్ అభిమానులను మేము నిరాశపర్చాం. కానీ ఈసారి మేము పూర్తిగా సిద్ధమయ్యాం. మేము ఇప్పుడు బ్రాండ్ క్రికెట్ ఆడుతున్నాము. టీ20 ప్రపంచకప్ గెలిచి పాకిస్తాన్ అభిమానులను సంతోషపెడతాం' అని చెప్పాడు. జట్టు గత వైఫల్యాలను మర్చిపోని, ప్రస్తుత



ప్రదర్శనతో అభిమానులను గర్వపడేలా చేస్తామని సల్మాన్ అలీ చెప్పుకొచ్చాడు. ఈ వ్యాఖ్యలు పాకిస్తానీ క్రికెట్ ప్రపంచంలో చర్చకు దారి తీసాయి. టోర్నీ ప్రారంభానికి ముందు ఈ ప్రకటనతో అభిమానుల్లో జట్టుపై నమ్మకం మరింత పెరిగింది.



# శ్రీచిదంబరం గారు.. ఓ మంచి కథ

వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన చిత్రం 'శ్రీ చిదంబరం గారు'. వినయ్–రత్నం దర్శకుడు. చింతా వినీషారెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాతలు. ఫిబ్రవరి 6న వంశీ నందిపాటి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఆ వేడుకకు నటి, నిర్మాత నిహారిక హాజరయ్యారు. మనసులోతుల్లో నుంచి పుట్టిన కథలే గొప్పవి అని ఆమె అన్నారు. ఇలాంటి కథలకు తప్పకుండా ఆదరణ లభిస్తుందని అన్నారు.




# అట్లీ, అల్లు అర్జున్ మూవీ

## రష్మిక హీరోయిన్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ వరల్డ్ చిత్రం ఎఎ22 ఇప్పటికే సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సైన్స్ ఫిక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, దీనిపై అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటు తున్నాయి. సినిమా గురించి చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో నటించే హీరోయిన్‌ల గురించి మరో క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే ఈ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మరో ముగ్గురు కథానాయికలు కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, రష్మిక మందన పేర్లు ప్రముఖంగా వినిపించగా, ఇప్పుడు రష్మిక మందన నిజంగానే షూటింగ్‌లో జాయిన్ అయిందన్న వార్త మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. ముంబైలో జరుగుతున్న షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటోందని, అల్లు అర్జున్, జాన్వీ కపూర్, 'కుబేర' ఫేమ్ జిమ్ సర్భ్‌లతో కలిసి కీలక సన్నివేశాల్లో నటిస్తోందని ఓ ఆంగ్ల మీడియా ఛానల్ వెల్లడించింది. దాదాపు నెల రోజుల పాటు కొనసాగే ఈ షెడ్యూల్‌లో యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ చిత్రీకరించనున్నట్లు సమాచారం. రమ్యకృష్ణ, యోగిబాబు వంటి ప్రముఖ నటీనటులు కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే సమయంలో విజయ్ దేవరకొండ,రష్మిక మందన పెళ్లి వార్తలు కూడా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండటంతో ఈ మూవీపై మరింత ఆసక్తి పెరిగింది. 'పుష్ప' సిరీస్‌లో అల్లు అర్జున్ , రష్మిక జంట బ్లాక్‌బస్టర్ హిట్ ఇవ్వడంతో ఈ కాంబో మళ్లీ రిపీట్ అవుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఈ చిత్రంలో రష్మిక నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుందన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఆమె కెరీర్‌లో చేయని సరికొత్త పాత్రలో, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యూనివర్స్ కాన్సెప్ట్‌తో విజువల్ వండర్‌గా తెరకెక్కుతుండగా, అల్లు అర్జున్ మల్టిపుల్ క్యారెక్టర్స్‌లో కనిపించనున్నట్లు సమాచారం.







# 16 ఏళ్ల లోపు వారిని సోషల్ మీడియాకు దూరం చేయాలి

## అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై సోనూసూద్ ఆందోళన

సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్ వ్యసనం యువతను, చిన్నారులను పెను ప్రమాదంలోకి నెడుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఆన్‌లైన్ గేమింగ్ కారణంగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకోవడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ విషాద ఘటనపై ప్రముఖ బాలీవుడ్ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ తీవ్రంగా స్పందించారు. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించాలని గతంలోనే కోరిన ఆయన.. ఈ తాజా ఘటన నేపథ్యంలో మరోసారి కేంద్ర ప్రభుత్వానికి తన విజ్ఞప్తిని బలంగా వినిపించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు.'ఘజియాబాద్‌లో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. వారు హింసకో, పేదరికానికో బలవ్వలేదు.. ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ వ్యసనం సృష్టించిన కనిపించని ఒత్తిడికి బలైపోయారు. నేను మళ్ళీ చెబుతున్నాను.. చదువు కోసం తప్ప, మిగతా అన్ని విషయాల్లో 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్‌లను నిషేధించాలి. బాల్యానికి కావాల్సింది సరైన మార్గదర్శకత్వం, ప్రేమ.. అంతే కానీ అల్గారిథమ్స్, స్క్రీన్లు కాదు. ఇది ఎవరినో నిందించడం కోసం కాదు, మన పిల్లలను కాపాడుకోవడం కోసం చేస్తున్న విజ్ఞప్తి. ఈ ఘటనను మరో వార్తగా చూసి మర్చిపోవద్దు.. ఇప్పుడైనా స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది'. అంటూ సోనుసూద్ రాసుకోచ్చాడు.

# మరో జన్మంటూ ఉంటే..

## దర్శకుడిగా పుట్టను: గుణశేఖర్

బలమైన కథలు, భారీ సెట్స్‌లకు పెట్టింది పేరు దర్శకుడు గుణశేఖర్. 'బాల రామాయణం' 'చూడాలని ఉంది', 'ఒక్కడు'లాంటి సినిమాలతో సత్తా చాటిన ఆయన ఇప్పుడు ఈతరం కథతో 'యుఫోరియా' ను తెరకెక్కించారు. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా 'మరో జన్మంటూ ఉంటే దర్శకుడిగా పుట్టను' అని ఇటీవల వ్యాఖ్యానించారు. 'డైరెక్టర్‌గా ప్రతిభ చాటిన మీరు అలా ఎందుకు అనాల్సి వచ్చింది? ట్రోలింగ్ కారణమా?' అని గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఓ విలేకరి ప్రశ్నించగా.. గుణశేఖర్ సమాధానమిచ్చారు.ట్రోలింగ్ సమస్య కాదు. అది ఎప్పుడూ ఉంటుంది. ఓ దర్శకుడి ఒత్తిడి గురించి చెబుతూ ఆ మాట అన్నాను. డైరెక్టర్ సీటులో కూర్చున్న ఎవరికైనా స్ట్రెస్ తప్పదు. ఏ ఉద్యోగంలోనైనా తృప్తి ఉంటుందిగానీ దర్శకులకు ఉండదు. తృప్తి ఉంటేనే కంటినిండా నిద్రపడుతుంది. అలాంటి నిద్రను 1992లో వదిలేసిన నేను ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నా. మళ్లీ హాయిగా వచ్చే జన్మలోనే నిద్రపోవాలన్న ఉద్దేశంతో డైరెక్టర్‌గా పుట్టను అని అన్నాను' అని వివరణ ఇచ్చారు. భూమిక, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. తాజా ప్రెస్‌మీట్‌లో భూమిక, గుణశేఖర్ కుమార్తె, నిర్మాత నీలిమ గుణ తదితరులు పాల్గొన్నారు. విలేకరులతో 'యుఫోరియా' టీమ్ పంచుకున్న విశేషాలివీ.. హైదరాబాద్‌లో జరిగిన ఓ సంఘటనను యథాతథంగా తెరపైకి తీసుకొచ్చారన్న టాక్ వినిపిస్తోంది. ముందుగా కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీయాలని నిర్ణయించుకున్నా. కానీ, కథ రాయడం మొదలుపెట్టాక అన్ని నగరాల్లోనూ, విదేశాల్లోనూ అలాంటి ఘటనలు జరిగాయి. ఈ సినిమాలోని సీన్స్ వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలను గుర్తుచేస్తాయన్నారు.







# బన్సాలీ మూవీ.. దో దీవానే షెహర్ మే'

బాలీవుడ్ స్టార్ నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'దో దీవానే షెహర్ మే'. ఈ చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా చిత్రయూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. అరేంజ్డ్ మ్యారేజ్ సెటప్‌లో కలిసిన ఇద్దరు వ్యక్తులు (శశాంక్ మరియు రోష్ని) మధ్య చిగురించిన ప్రేమ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. శశాంక్ (సిద్ధాంత్) తన ఉచ్చారణ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, రోష్ని (మృణాల్) తన అందం విషయంలో బాధపడుతూ ఉంటుంది. ఇద్దరు అసంపూర్ణమైన వ్యక్తులు ఒకరినొకరు ఎలా అర్థం చేసుకున్నారనేదే ఈ సినిమా. నేటి తరం యువత ప్రస్తుతం ఎదుర్కొంటున్న అభద్రతా భావం, ఒత్తిడి, నిజమైన ప్రేమ వెతుకులాటను ప్రతిబింబించేలా ఈ సినిమాను దర్శకుడు రవి ఉద్యావార్ తెరకెక్కించాడు. తెలుగులో 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతోనే బాలీవుడ్‌కు పరిచయం అవుతుండటం విశేషం. భన్సాలీ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో ఇలా అరుణ్, జాయ్ సేన్ గుప్తా కీలక పాత్రలు పోషించారు.

Printer, publisher and Owned by **NASKANTI LAXMINARAYANA,** Published from 2-596 , Sainagar , old Hafeezpet, serlingamplly, ,HYDERABAD, TELANGANA-500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH-518380. Editor: NASKANTI LAXMINARAYANA , **PRGI NO TGTEL/25/A4524.**